# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : మంజుల దాసు

తెలంగాణ ఆదివారం, 01 - జూన్ - 2025 సంపుటి : 16 సంచిక : 306 పేజీలు 08 వెల : 6/-


# గిరిజనుల అభివృద్ధికి 25 లక్షల అసైన్డ్ భూముల పంపిణీ

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

గిరిజన వర్గాల అభివృద్ధికి బాటలు వేస్తూ వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని క్రీడా ఆశ్రమ పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ బునియాది కార్యకర్తల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ పాలనలో గిరిజనుల అభివృద్ధికి సుమారు 25 లక్షల అసైన్డ్ భూములను పంపిణీ చేశారని తెలిపారు.ఆ భూములను ధరణి పేరుతో బిఆర్ఎస్ నాయకులు స్వాధీనం చేసుకొన్నారని ఆరోపించారు. భూ భారతి చట్టం ద్వారా ఆ భూములను సర్వే చేసి మళ్లీ గిరిజనులకు స్వాధీనం చేస్తామని అన్నారు. గిరిజన వర్గాల సంక్షేమానికి, అభివృద్ధి కోసం కాంగ్రెస్ కొత్త విధానాలతో పథకాలను ప్రవేశ పెడుతున్నదని పేర్కొన్నారు. ప్రజల, ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఇచ్చిన హామీ మేరకు ధరణి స్థానంలో భూ భారతిని అమలు చేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్‌తోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. గిరిజన ప్రజల హక్కులపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి గిరిజన బిడ్డ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముందుగా ఏఐసిసి సభ్యురాలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి పాఠశాల ఆవరణంలో పిచ్చిమొక్కలను తొలగించి శ్రమదానం చేశారు. అనంతరం మొక్కలు నాటారు.





# జాగృతి సంస్థ.. తెలంగాణ ప్రజల గొంతుక

### బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

తెలంగాణ ప్రజల గొంతుక జాగృతి సంస్థ అని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. శనివారం బంజారాహిల్స్ తెలంగాణ జాగృతి కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ జాగృతి ప్రారంభించి 18 ఏళ్ల అయిందని.. మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, ఆచార్య జయశంకర్ స్ఫూర్తితోనే తెలంగాణ జాగృతి సంస్థ పుట్టిందని చెప్పారు. యూఎస్ నుంచి వచ్చాక జయశంకర్ మాకు మార్గదర్శనం చేశారని తెలిపారు. ఉద్యమం ఉధృతంగా జరుగుతున్నా.. ఏదో కొంత గ్యాప్ ఉందని ఆ గ్యాప్‌ను ఫిల్ చేయాలని జయశంకర్ తనకు సూచించారని ఆమె అన్నారు. మేము చేసిన ఉద్యమాల వల్ల చాలా జీవోలు వచ్చాయని కవిత చెప్పారు. కాగా, ఇందిరాపార్క్ వద్ద ఉన్న తెలంగాణ జాగృతి కార్యాలయాన్ని మూసివేసి.. బంజారాహిల్స్‌లోని తన ఇంటి సమీపంలోనే కవిత కొత్త ఆఫీస్ ను ప్రారంభించారు.

# గోశాలల ఏర్పాటుకు కమిటీ

### పూర్తిస్థాయి ప్రణాళిక రూపొందించాలి : సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో గోశాలల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేయాలనీ, నిర్ణీత గడువులోగా ఆ కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గోసంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలని సూచించారు. మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలనీ, కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇరుకు స్థలాల్లో బంధించినట్లుగా కాకుండా మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణకు సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్‌ను ప్రభుత్వం ఖరారు చేయనున్నది. ఈ సమీక్షా సమావేశంలో సీఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్ రాజ్, అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సవ్యసాచి ఘోష్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుపోషణ విభాగం డైరెక్టర్ బి.గోపి, అధికారులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీలకు ప్రభుత్వం తీపి కబురు

రాష్ట్రంలో ఉన్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ వయస్సును పెంచుతూ జీఓ జారీ చేసింది. ఈ మేరకు శనివారం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంపుతో పాటు, పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. లక్ష ఉండగా తాజా ఉత్తర్వుల్లో దానిని రూ. 2 లక్షలకు పెంచింది. అంగన్‌వాడీ హెల్పర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. 50వేలు ఉండగా దాన్ని రూ. లక్షకు ప్రభుత్వం పెంచింది. అంగన్‌వాడీ సిబ్బంది పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలు కాగా, వివిధ కారణాలతో 60 ఏళ్లు దాటిన తరువాత విఆర్ఎస్ తీసుకునే టీచర్లు, హెల్పర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వర్తింపచేయనున్నట్లు ప్రభుత్వం ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది.



# మిస్ వరల్డ్ సుచాత చువాంగ్ శ్రీ

### విజేతకు రూ.8.5 కోట్ల ప్రైజ్ మనీ




టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

మిస్ వరల్డ్ 72వ పోటీలో థాయిలాండ్‌కు చెందిన ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ ప్రపంచ సుందరి కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా ప్రపంచ సుందరి సుచాత చువాంగ్‌కు కిరీటాన్ని అలంకరించారు. మొదటి రన్నరప్‌గా ఇథియోపియా, రెండవ రన్నరప్‌గా మిస్ పోలెండ్, మూడవ రన్నరప్‌గా మిస్ మార్టినిక్ నిలిచారు. మిస్ వరల్డ్‌గా ఎంపికైన సుచాతకు రూ.8.5 కోట్ల ప్రైజ్ మనీ అందనుంది. సుచాత.. థారులాండ్‌లోని ఫుకెట్‌లో జన్మించారు. మొత్తం 108 దేశాలకు చెందిన కంటెస్టెంట్‌లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 'ఓపల్ ఫర్ హెర్' ప్రాజెక్టును ప్రమోట్ చేసేందుకు సుచాత మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్నారు. దీని ద్వారా ప్రపంచ వ్యాప్తంగా బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడమే తన లక్ష్యంగా పని చేస్తున్నారు. 16 ఏండ్ల వయస్సులోనే క్యాన్సర్ ముప్పు నుంచి బయటపడిన ఆమె.. థారులాండ్ లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు. వారికి అండగా ఉండేందుకు నిధుల సేకరించడంతోపాటు, కొన్ని సంస్థలతో కలిసి పని చేస్తున్నారు. ప్రభావితం చూపే లక్ష్యంతో యువత ముందడుగు వేయాలని ఆమె పిలుపునిచ్చారు. పోటీలకు జడ్జిలుగా మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లీ, సినినటులు సోనూ సుద్, రానా దగ్గుబాటి, నమ్రత శిరోద్కర్, సుధారెడ్డి, జయేష్ రంజన్, మనూషి చిల్లర్, , డోనా వాల్ష్ వ్యవహరించారు. అంతకు ముందు తెలంగాణ చేనేత వస్త్రాలతో రూపొందించిన భారతీయ సంప్రదాయ వస్త్రాలతో పోటీదారులు ఆకట్టుకు న్నారు. మిస్ వరల్డ్ హ్యూమానిటేరియన్ (మానవతావాది) అవార్డును దగ్గుబాటి రానా చేతుల మీదుగా సోనూసుద్‌కు అందజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రముఖ నటులు చిరంజీవి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# ట్రంప్ ప్రకటనపై మోడీ మౌనం వీడాలి

### కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్

హైదరాబాద్: మరోసారి ప్రధాని మోడీపై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. ద్వైపాక్షిక ఒప్పందం ద్వారా మాత్రమే కాల్పుల విరమణ జరిగిందని ప్రధాని ఎందుకు చెప్పలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు."భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించానంటూ ట్రంప్ పదేపదే ఒకే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య ఘర్షణలు తగ్గించడానికి తాము జోక్యం చేసుకున్నామని, వాణిజ్యాన్ని ఒక సాధనంగా వాడామని చెప్తున్నారు. చివరికి కోర్టులోనూ అదే వాదన. కానీ ట్రంప్ ప్రకటనలపై స్నేహితుడు నరేంద్రమోదీ పూర్తిగా మౌనం వహిస్తున్నారు. ఆయన ఎందుకు మాట్లాడటం లేదు..?" అని ఎక్స్ వేదికగా జైరాం రమేశ్ రాసుకొచ్చారు. మే7 ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ వాయుసేనలు పాక్ ఉగ్రశిబిరాలపై బాంబుల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. నాలుగు రోజుల పాటు రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఈ క్రమంలో నాటకీయ పరిణామాల మధ్య ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో యుద్ధానికి ముంగిపు పలికాయి. అయితే అందరి కన్నా ముందే భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలను తానే తగ్గించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రకటించుకుంటున్న సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీని కొన్ని రోజులుగా ప్రశ్నిస్తోంది.



since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
ఆదివారం,
01-06-2025
2

## వేసవి దుక్కులతో నాణ్యమైన పంట

### ఏఈఓ ముత్యం తిరుపతి



**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-**

వేసవి రైతులు వేసవి దుక్కులు వేసుకోవడం వలన భూమి గుల్ల బారి, పంట వేర్లు ఎక్కువగా విస్తరించి, బలమైన పంట ఏర్పడుటకు దీంతో నాణ్యమైన పంట పొందుటకు వీలవుతుందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి తెలిపారు. మండలంలోని పొన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని రైతులకు శనివారం వేసవి దుక్కుల ప్రయోజనాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ, వేసవి దుక్కులతో భూమి తొలికారి వర్షాలు కురిసిన తర్వాత ఎక్కువగా నీటిని పట్టి ఉంచుకొని, ఎక్కువ రోజులు తేమను పంటకు అందిస్తుందన్నారు. అదేవిధంగా వేసవి దుక్కులు లోతుగా చేసుకోవడంతో భూమి లోపల పొరల్లో ఉన్న వివిధ శత్రు పురుగులు ప్యూప దశలోనే నశించబడి, కీటక సంహారణ జరుగు తుందని, వివిధ శిలీంద్ర బీజాల నివారణ జరిగి తదుపరి పంటకు భూమి తో ఆశించు చీడపీడల నివారణ సమర్థవంతంగా జరుగుతుందని వివరించారు. దీంతో పాటు వివిధ రకాలైన కలుపు మొక్కలు విత్తనాలు ఎండ వేడికి నశింపబడి, కలుపు నివారణ సైతం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సైన్ల కనకరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి హరీష్, కారోబార్ బాణీష్, పెంచాల రాజలింగు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి,జిల్లా ఇంచార్జ్ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను టీఎన్జీవో నేతలు కోరారు. శనివారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆమెను జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత కార్యాలయ సము దాయంలో టిఎన్జీవో జిల్లా మర్యాదపూర్వకంగా కలిసి,మొక్కను బహు కరించారు.ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.ఈ కార్య క్రమంలో టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి,కార్యదర్శి భూముల రామ్మో హన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు లు పాల్గొన్నారు.


## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**

జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఫౌండర్, బిజెపి నేత రఘునాథ్ వెరబెల్లి తెలిపారు. రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ఎఫ్సిఏ ఫంక్షన్ హాల్ లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు జిల్లా నలుమూలల నుండి సుమారు 200 పైగా డిగ్రీ, ఇంటర్మీడియట్ చదువుకున్న యువతీ యువకులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో హైదరాబాద్ కు చెందిన ఎమ్మెస్ఎన్ ఫార్మా, ఐటిసి, న్యూ లాండ్ సంస్థల ప్రతినిధులు పాల్గొని, ఇంటర్వ్యూలు నిర్వహించి, యువతను ఉ ద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, రానున్న రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి, యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పించడానికి కృషి చేస్తామని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, జోగుల శ్రీదేవి, అమిరిశెట్టి రాజ్ కుమార్, బోయిని హరికృష్ణ, బింగి సత్యనారాయణ, మెరెడికొండ శ్రీనివాస్, చిరంజీవి లు పాల్గొన్నారు.

## ఘనంగా అహల్య బాయి హెూల్కర్ జయంతి వేడుకలు



**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**

జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ఎఫ్సిఏ ఫంక్షన్ హాల్లో గురువారం బిజెపి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్,బిజెపి నేత రఘునాథ్ వెరబెల్లి లు అహల్య బాయి హెూల్కర్ చిత్రపటానికి పూలమాలవేసి,ఘనంగా నివాళులర్పించారు,అనంతరం భారీ ర్యాలీ నిర్వ హించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మహిళల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అహల్య బాయి హెూల్కర్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఎనగందుల కృష్ణమూర్తి, జోగుల శ్రీదేవి,మాసు రజిని,పట్టి వెంకటకృష్ణ,పెద్దపల్లి పురు షోత్తం, అమిరిశెట్టి రాజ్ కుమార్, సత్రం రమేష్,గడ్డం స్వామి రెడ్డి,నాగిరెడ్డి,హేమంత్ రెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హత గల ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు



### రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**

ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఫలాలు అర్హత గల ప్రతి ఒక్కరికి అందేలా అధికార యంత్రాంగం సమిష్టిగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, రాజర్షి షా, అభిలాష అభినవ్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, శాసనమండలి సభ్యులు మల్క కొమురయ్య, దండే విఠల్, మంచిర్యాల, బెల్లంపల్లి, ముథోల్ నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, రామారావు పటేల్, జిసిసి చైర్మన్ కొట్నాక తిరుపతి లతో కలిసి ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, రెవెన్యూ, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖల అధికారులతో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, యాసంగి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ సాగు సన్నద్ధం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. యాసంగి వరి ధాన్యం సేకరణ కొరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, వరి ధాన్యం సేకరించడం జరుగుతుందని, ధాన్యం సేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుతుందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవల సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం- 2025లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేసి, దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత సమస్యలను జూన్ 2 లోగా పరిష్కరించడం జరుగుతుందని, 2వ విడతలో జిల్లాకు ఒక మండలం చొప్పున ఎంపిక చేసి, దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. జూన్ 3 నుండి జూన్ 20 వరకు అన్ని మండలాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూ భారతి చట్టం, రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రైతులు తమ భూములను స్వేచ్ఛగా సాగు చేసుకునేలా, ఎలాంటి వివాదాలు లేకుండా భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. నియోజక వర్గానికి 3500 చొప్పున రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరిగిందన్నారు. అత్యంత పేదవారికి ఈజాబితాలో చోటు కల్పించడం జరుగుతుందని, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పివిటిజిలు, ఇతర ఆదివాసీలకు 5 వేల ఇందిరమ్మ ఇండ్లు ప్రత్యేకంగా కేటాయిం చడం జరిగిందని తెలిపారు. ఖరీఫ్-2025 సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం కావాలని, నైరుతి రుతుపవనాలు వస్తున్నందున విత్తనాలు, ఎరువులు అవసరమైన మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అధిక ధరలకు విక్రయిస్తూ, కృత్రిమ కొరత సృష్టించే వారిపై, నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రకృతి వైపరీత్య నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసి, తగు చర్యలు తీసుకోవాలని, నీటిపారుదల, వైద్య-ఆరోగ్య, వ్యవసాయ శాఖలు, సంబంధిత శాఖలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని, చేపట్టిన కార్యక్రమాలపై కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న దృష్ట్యా పాఠశాలలు, వసతిగృహాలు సిద్ధం చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి, కౌమార దశ పిల్లల కొరకు పౌష్టికాహారం కొరకు చిక్కీలను ఇవ్వడం జరుగుతుందని, అంగన్వాడీ టీచర్లకు 2 లక్షల రూపాయల రిటైర్మెంట్ బెన్ఫిట్స్, వేసవి సెలవులు ఇవ్వడం జరుగుతుందని, జీతాల పెంపుదల అంశంపై ప్రభుత్వం ఆలోచిస్తుందని, 35 వేల 700 అంగ న్వాడీ కేంద్రాలను ప్రి-ప్రైమరీ పాఠశాలలుగా మార్చడం జరిగిందని, 50 రకాల ఆట వస్తువులు అందించడం జరిగి ందని, టీచర్లు, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించి, దేశం లోనే రాష్ట్రం ముందంజలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ఏప్రిల్ 14న ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం-2025లో భాగంగా పైలెట్ మండలంగా జిల్లాలోని భీమారం మండలం ఎంపిక చేయడం జరిగిందని, ఈ క్రమంలో భీమారం మండలంలోని 12 గ్రామపంచాయతీలలో 28 మంది సిబ్బందితో 4 బృందాలను నియమించి, భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఒక ప్రత్యేక సర్వే బృందంతో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. 2148 దరఖాస్తులు రాగా 1010 సాదాబైనామాపై అందాయని, న్యాయస్థానంలో కేసులు కొనసాగుతున్నందున తీర్పు అనంతరం పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. మిగిలిన 1138 దరఖాస్తులలో 741 ఇప్పటివరకు పరిష్కరించడం జరిగిందని, మిగిలిన వాటిని జూన్ 5 లోగా పరిష్కరిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో 2 వేల ఇండ్లు మంజూరు కాగా 991 ఇండ్లు గ్రౌండ్ ప్రక్రియ పూర్తయ్యాయని, నిర్మాణ దశను బట్టి బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం ఈ సమయానికి 1 లక్షా 35 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేయగా ఈసారి 1 లక్షా 77 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. గతంలో పోల్చితే ఈసారి 1.5 / 2 రెట్లు అధికంగా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఫిబ్రవరిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి జిల్లాలో నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువుల రవాణా, విక్రయంపై చర్యలు చేపట్టామని, ఇప్పటి వరకు 34 మందిని అరెస్టు కాగా 871 కిలోల నకిలీ, నిషేధిత విత్తనాలను స్వాధీనపర్చుకోవడం జరిగిందని వివరించారు. జిల్లా సరిహద్దులో అంతర్గత చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కిశోర బాలికల కొరకు ఇందిరమ్మ అమృతం పథకం క్రింద పల్లీలు, చిరుధాన్యాలతో తయారుచేసిన చిక్కీల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిబద్ధత గల నిజమైన జర్నలిస్ట్ ఎండి మునీర్

### మునీర్ కు గని కార్మికుల ఘన నివాళులు

**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-**



వార్తే ప్రజలు, ప్రజలే నా జీవితం అని భావించిన నిబద్ధత గల నిజమైన సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమ నేత ఎండి మునీర్ అని ఆయా కార్మిక సంఘాల నాయకులు కొనియాడారు. సింగరేణి ఏరియాలోని కేకే 5 గని పై శనివారం కార్మిక సంఘాలు, కార్మికుల ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమ నేత మునీర్ కు సంతాప తెలిపారు. ఈసందర్భంగా ముందుగా మునీర్ చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులు అర్పించి, అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి, మునీర్ కు ఘన నివాళులు అర్పించారు. అనంతరం పలువురు కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ, బొగ్గు పేల్లకు గొంతుక ఉంటే ముందు పిలిచే పేరు మునీర్ అని కొనియాడారు. సింగరేణిలో బొగ్గు గని కార్మికునిగా వారి కష్టాలు కన్నీళ్లు సమస్యలు పరిష్కరించేందుకు యాజమాన్యం నిరంకుశ విధానాలపై పోరాటాలు సైతం చేసిన గొప్ప కార్మిక నాయకుడు సైతం అతనే అని తెలిపారు. సింగరేణిలో కార్మిక సంఘాల లోపాలను సైతం ఎండగట్టి, వారు కార్మికులకు ఎలా పని చేయాలో సైతం సూచించిన మార్గదర్శకుడని కొనియాడారు. 1980 ఎమర్జెన్సీ కాలంలో మందమర్రిలో దొరల భూస్వాముల దౌర్జన్యాల వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు చేసిన ఉద్యమ నాయకుడు అని, ఆ కాలంలో ప్రజలు స్వేచ్ఛ వాయువులు పీల్చుకున్నారంటే కేవలం మునీర్ పోరాటాల వల్లనే సాధ్యమైందని తెలిపారు. ప్రకృతికి విరుద్ధంగా బొగ్గు గనులలో పనిచేస్తూ, ప్రాణాలను పణంగా పెట్టి, నల్ల బంగారాన్ని వెలికి తీస్తున్న చీకటి సూర్యుల కన్నీటి కష్టాలను కడతెరిచేందుకు బండ కింద బ్రతుకులు అనే పేరిట సంవత్సరం కాలం పాటు ఆంధ్రజ్యోతి పత్రికలో శీర్షిక రాసిన ఏకైక జర్నలిస్టు మునీర్ అని అన్నారు. కేకే 5 గనిలో కార్మికునిగా క్లర్కుగా రెండున్నర దశాబ్దాలు పనిచేశారని, ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రజలలో మమేకమై, ప్రజలే వార్తలుగా వార్తలే ప్రజలుగా జీవించిన ధన్యజీవి అని కొనియాడారు. ఎన్నోసార్లు మునీర్ ను దొరలు హత్య చేయించాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని ప్రజలే కాపాడుకున్న చరిత్ర అతనిది అని తెలిపారు. నాలుగు దశాబ్దాల పాటు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నటు వంటి పరిణామాల గురించి అనేక వ్యాసాలు ప్రజలను చైతన్యం చేసిన నిజమైన జర్నలిస్టు అని అన్నారు. ప్రాణాంతక వ్యాధి ఒకవైపు ప్రాణాలు తోడేస్తున్న పాలకవర్గ విధానాలను ప్రశ్నిస్తూ ప్రజల సమస్యలపై తన కలానికి బలంగా అని చెప్పిన ప్రజల గొంతుక సైతం అతడే అని తెలిపారు. లక్షలాది ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న గొప్ప మేధావి నల్ల బంగారు నేలలో వికసించిన విప్లవాది అని అన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం సింగరేణి చీకటి సూర్యులు 35 రోజులు చేసిన సకల జనుల సమ్మె సింగరేణి జేఏసీ చైర్మన్ గా ఆయన చేసిన పోరాటం స్ఫూర్తి ఎందరో ఆదర్శమని తెలిపారు. అదేవిధంగా సింగరేణి కార్మిక ఉద్యమాలతో పాటు ప్రజా పోరాటాలు సామాజిక చైతన్య ఉద్యమాలలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. సింగరేణి ఉన్నంతకాలం ప్రతి కార్మికుడు ఆయన పేరు స్మరించుకుంటూనే ఉంటారని అన్నారు. ఆయన ఆశయ సాధన లక్ష్యంగా, అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మునీర్ మిత్రుడు జి చందర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు భీమానాధుని సుదర్శన్, ఓ రాజశేఖర్, కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, రాంశెట్టి నరేందర్, భీమర సదయ్య, ప్రసాద్, రామకృష్ణ లు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ


### జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**

రానున్న విద్యా సంవత్సరం 2025-26 గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం క్రింద 1, 5 తరగతులలో ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1వ తరగతికి (నాన్ రెసిడెన్షియల్-91 సీట్లు), 5వ తరగతికి (రెసిడెన్షియల్-92) సీట్లు కేటాయించడం జరిగిందని, షెడ్యూల్డ్ కులములకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు జూన్ 3 నుండి జూన్ 16 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో లభిస్తాయని తెలిపారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం వరిస్తుందని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1 లక్షా 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉ ండాలన్నారు. అభ్యర్థులు జనన ధృవీకరణ పత్రం (1వ తరగతి అభ్యర్థులు జూన్ 1, 2019 నుండి మే 31, 2020 మధ్య జన్మించి ఉండాలని), మీ-సేవ చే జారీ చేయబడిన కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, 3 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, పాఠశాల నుండి గత సంవత్సరం మార్కుల జాబితా నకలు ప్రతులు (5వ తరగతి అభ్యర్థులకు), అన్ని నకలు ప్రతులపై గెజిటెడ్ అధికారిచే ధృవీకరణ సంతకం చేయించాలని తెలిపారు. అభ్యర్థులు గడువులోగా దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులము అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందించాలన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## డిగ్రీ రెండవ విడత అడ్మిషన్లు ప్రారంభం

- డిగ్రీ కొత్త కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి
- రిజిస్ట్రేషన్ లో బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు
- మొదటి ప్రాధాన్యత ఇవ్వండి
- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్



**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**

జిల్లాలోని బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండవ విడత డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్, దోస్త్ కోఆర్డినేటర్ మేడ తిరుపతి లు శనివారం ప్రకటనలో తెలిపారు. అన్ని హంగులతో కొనసాగుతున్న బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరంలో నూతన కోర్సులు ప్రారంభమయ్యాయని, వాటిని సద్వినియోగం చేసుకొని, ఉపాధి పొందాలని కోరారు. దోస్త్ వెబ్సైట్ తో బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లను అందజేస్తున్నామన్నారు.మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికాగా,రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, జూన్ 8 వరకు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.కళాశాలలో బిఏ,బికాం సిఏ,బిఎస్సి లైఫ్ సైన్సెస్ ఫిజికల్ సైన్సెస్ కోర్సులతో పాటు ఈ ఏడాది కొత్తగా బికాం బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీ సెస్ ఇన్సూరెన్స్,బికాం టాక్సేషన్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిగ్రీ అడ్మిషన్ కై దోస్తు సందేహాలకు 9959269975 నెంబర్ను,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ను సంప్రదించాలని తెలిపారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
ఆదివారం,
01-06-2025


# రైతులకు 282 కోట్లు చెల్లింపు..183977 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

### జిల్లాలో ముగియ వచ్చిన ధాన్యం సేకరణ

### 264 కేంద్రాల్లో ముగిసిన ధాన్యం సేకరణ

### జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

జిల్లాలో రైతులకు ఇబ్బందులు లేకుండా యజ్ఞంగా ధాన్యం కొనుగోలు చేయడంతో ధాన్యం కొనుగోలు వేగంగా ముగియ వస్తుందని, జిల్లాలో 264 కేంద్రాల్లో ధాన్యం సేకరణ ముగిసిందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, 264 ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు విజయవంతంగా ముగించుకొని, 320 కేంద్రాలతో 183977.000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 26164 మంది రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి, 282.13 కోట్ల రూపాయల చెల్లింపులు చేయడం జరిగిందని వివరించారు. ఇది గతం కన్నా ఘనమైనదని తెలిపారు. 1500 మంది సిబ్బంది హమాలీలు యజ్ఞంలో జిల్లాలో దాన్యం కొనుగోలు చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం ఖాంటా వేసి, 358 లారీలతో 6000 - 8000



టన్నుల ధాన్యాన్ని కరీంనగర్ లోని 68 రైస్ మిల్లులకు, పెద్దపల్లి లోని 110 రైస్ మిల్లులకు, మంచిర్యాల లోని 21 రైస్ మిల్లులకు తరలించి, రైతులు దిగుమతి వేగంగా జరుగుతుందని తెలిపారు. రైతులు పండించిన దాన్యం నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతిరోజు 5 నుంచి 8 కోట్ల రూపాయలు రైతులకు చెందిన బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఆటోమేటిక్ యంత్రంతో శుభ్రం చేసి, కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. అకాల వర్షం కురిస్తే కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉన్న టార్పలిన్ వాడుకోవాలని, ధాన్యం కొలతలు పరీక్షించి, గ్రేడ్ ఏ ధాన్యం, కామన్ ధాన్యం అని నిర్ణయించుకోవాలని, ఆ విధంగా మంచి ఫలితాలు పొందడానికి అవకాశం ఉందన్నారు. అన్ని అడ్డంకులను అధిగమించి, ధాన్యం కొనుగోలను వేగవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌక్యం కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, నీడ, ఓఆర్ఎస్, గోనె సంచులు, టార్పాలిన్లు, ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి, మద్దతు ధర పొందాలని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతుల వద్ద నుండి పూర్తిస్థాయిలో నిబంధనల ప్రకారం వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశార

# నిరుపేదల కోసం మహా ప్రస్థానం

### రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో నిర్మించిన మహాప్రస్థానం (వైకుంఠ ధామం) నిరుపేద ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. శనివారం జిల్లాలోని మంచి ర్యాల పట్టణంలోగల మహా ప్రస్థానం ను మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, రాజర్షి షా, అభిలాష అభినవ్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, శాసనమండలి సభ్యులు దండే విఠల్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిసిసి చైర్మన్ కొట్నాక తిరుపతి లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ, మంచిర్యాల పట్టణంలో నిర్మించిన మహాప్రస్థానం రాష్ట్రంలోనే అత్యున్నతంగా ఉందని, ప్రజల కొరకు నిర్మించిన మహాప్రస్థానంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పుట్టినరోజు వేడుకలు



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో శనివారం బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు సబ్బని అరుణ్ ఆధ్వర్యంలో శనివారం బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సబ్బని అరుణ్ మాట్లాడుతూ, బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. దుర్గం చిన్నయ్య అభివృద్ధి ప్రజల అభివృద్ధి, ప్రజల అభ్యున్నతి కోసం తన సంకల్పం ఇంకా జనహృదయాల్లో నిలిచి ఉంది కాబట్టే ప్రజలు నేటికీ ఆయన చేసిన మంచి కార్యాలను గుర్తుపెట్టుకుంటూ, ఆశీర్వదిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, నాయకులు మద్దల గోపి, కాంపల్లి రాజం, గద్దల ధర్మేందర్, ఖాన్, దాసరి సతీష్, ఖలీమ్, మచ్చ రాజేష్, కృష్ణ రాజ్, చంద్రశేఖర్, మహేందర్, వెంకటేష్, చరణ్ లు పాల్గొన్నారు.

# ఫుట్ పాత్ ఖాబ్జాలు తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించండి

### నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో నెలకొన్న అక్రమ కబ్జాలను తొలగించి ట్రాఫిక్ ను నియంత్రించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. జిల్లా పోలీస్ కమీషనర్ సాయి చైతన్య, నగర మున్సిపల్ కమీషనర్ దిలీప్ కుమార్, ఉన్నత అధికారులతో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పోలీస్ కమీషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు రాష్ట్రంలో అత్యంత పెద్ద నగరాలలో ఒకటైన ఇందూర్ నగర అభివృద్ధి, సుందరికరణకు అందరం సమిష్టి కృషితో ముందుకు పోవాలన్నారు. నగరంలో జనాభా పెరుగుతున్న క్రమంలో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యను ఎదురుకుంటున్నారని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఫుట్ పాత్ ఖాబ్జాలు, సిగ్నల్ పాయింట్స్, వన్ వే రోడ్, పార్కింగ్ విషయాలలో కఠిన నిర్ణయాలు తీసుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలేత్తకుండా చూసుకోవాలన్నారు. ఇందూర్ జిల్లాలో డ్రగ్స్, గంజాయి మహమ్మారి విచ్చలవిడిగా సరఫరా జరుగుతుందని వందల మంది యువత తమ బంగారు భవిష్యత్తు మత్తులో చిత్తూ చేసుకుంటున్నరని అన్నారు. గంజాయి, డ్రగ్స్ మారకద్రవ్యలు సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని ఉక్కుపాదం మోపాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాల క్యాంపస్ లో మారకద్రవ్యలపై విద్యార్థులకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని విజ్ఞప్తి చేసారు. నగరంలో గ్యాంగ్ వార్ లతో ప్రజలను



భయభ్రాంతులకు గురి చేస్తున్న అల్లరి మూకలను ఉపేక్షించేది లేదన్నారు. లా ఆండ్ ఆర్డర్ అదుపు చేయడంలో పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించాలని అన్నారు. అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా దుకాణాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటు గత కొద్ది రోజుల నుంచి నిర్ణీత సమయానికి మూసివేయడంలో విజయం సాధించిన పోలీస్ శాఖను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

### ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



మంథనిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (జేఎన్టీయూ హెచ్) లో ప్రవేశానికి సింగరేణి ఉద్యోగుల పిల్లలు సింగరేణి ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ శనివారం ప్రకటనలో తెలిపారు. మైనింగ్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, (ఏఐ అండ్ మెషీన్ లెర్నింగ్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో మూడు చొప్పున మొత్తం 36 సూపర్ న్యూమరి సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇందులో ఎగ్జిక్యూటివ్ పిల్లలకు 18 సీట్లు, సింగరేణి ఉద్యోగుల పిల్లలకు 18 సీట్లు కేటాయిస్తారన్నారు. విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో తెలంగాణ ఏఈపి సెట్ లో అర్హత సాధించి ఉండాలని, నిర్ణీత నమూనాలలో దరఖాస్తును అన్ని సర్టిఫికెట్లతో జత చేసి, జూన్ 14 లోగా జిఎం (హెచ్ఆర్డి) లో సమర్పించాలని సూచించారు. కౌన్సిలింగ్లో ఎంపికైన విద్యార్థులు నిర్ణిత ఫీజును జేఎన్టీయూహెచ్, యూనివర్సిటీ ఆఫ్ కాలేజ్ ఇంజనీరింగ్, మంథని పేరిట బ్యాంకులో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సింగరేణి ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# అక్రమంగా భూ కబ్జాలకు పాల్పడుతున్నారు

### అడ్డొస్తే అట్రాసిటీ కేసులు అంటూ బెదిరిస్తున్నారు

### తమకు న్యాయం చేయాలని బాధితుని ఆవేదన

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

తమ భూమిని అక్రమంగా కబ్జా చేయడమే కాకుండా దానికి అడ్డొస్తే అట్రాసిటీ కేసు నమోదు చేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని బాధితుడు సింహాద్రి తన గోడును వెలి బుచ్చారు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని మద్దేపల్లి గ్రామ శివారులో గల భూమి యాజమాన్యులు సింహాద్రి వెంకటేశ్వర్ రావు 7 ఎకరాల 35 గుంటల భూమి తమకు ఉండేదని, ఆ భూమిని కాట్రోత్ రవి కుమార్ అనే వ్యక్తి కబ్జాకు పాల్పడుతున్నారని బాధితుడు ఆరోపించాడు. సందర్భంగా నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ తమ భూమిలో వెళ్లి పొలం వేసుకున్న తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వేసిన పొలాన్ని కోసుకొని మరీ అమ్ముకున్నారని, ఎవరైనా ఆయనను ప్రశ్నిస్తే అట్రాసిటీ కేసులు పెడుతున్నారని బాధితుడు ఆరోపించారు. తమ భూమి సర్వే నెంబర్ 193, 194, 195, 189,199లో 5 ఎకరాల 17 గుంటలు భూమిని కట్రోత్ రవి, వాళ్ళ తండ్రి నీ 2005 సంవత్సరంలో అమ్మినామన్నారు. మిగిలిన 2 ఎకరాల 8 గంటల భూమిని ఆయన కబ్జా చేసుకున్నారని బాధితులు తెలిపారు. ధరణిలో ఎమ్మార్వోలు చేసిన తప్పుల వలన ఈ పరిస్థితి



వచ్చిందన్నారు. అన్ని మీడియాలలో తప్పుడు కథనాలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వార్తలను నమ్మద్దన్నారు. తమకు జీవనాధారం ఈ భూమి తప్ప వేరే ఏమీ లేదని, అడ్డొస్తే అట్రాసిటీ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని తగిన న్యాయం చేయాలని కోరారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఈ పరిస్థితులను చూసి మాకు న్యాయం చేసేలా చూడాలని బాధితులు వేడుకుంటున్నారు.

# విధిగా జీవన్ ప్రమాణ్ సర్టిఫికెట్ అందజేయాలి



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

సీఎంపీఎఫ్ ద్వారా పెన్షన్ పొందుతున్న రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో జీవన్ ప్రమాణ్ సర్టిఫికెట్ విధిగా సీఎంపీఎఫ్ వారికి అందజేయాలని ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ శనివారం ప్రకటనలో తెలిపారు. సకాలంలో జీవన్ ప్రమాణ్ సర్టిఫికెట్ అందజేయని యెడల రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ జనవరి నెల నుండి నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం విధిగా జీవన్ ప్రమాణ్ సర్టిఫికెట్ అందజేయడం పరిపాటిగా పాటించాలని సూచించారు. సీఎంపీఎఫ్ వారు పెన్షన్ పంపిణీ బాధ్యత దన్ బాద్ ఎస్బీఐ వారికి అప్పగించడం జరిగిందని, 2023 సంవత్సరం నుండి దేశ వ్యాప్తంగా సీఎంపీఎఫ్ పెన్షన్ పంపిణీ ఎస్బీఐ చేపట్టారని తెలిపారు. ఇటీవల చాలా మంది రిటైర్డ్ ఉద్యోగులు జీవన్ ప్రమాణ్ సర్టిఫికెట్ అందజేకపోవడం, సరైన సమాచారం లేకుండా ఇవ్వడం మూలంగా చాలా మంది పెన్షన్ పొందలేకపోతున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రతి రిటైర్డ్ ఉద్యోగి నవంబర్ నెలలో తమకు సంబందించిన జీవన్ ప్రమాణ్ సర్టిఫికేట్ ను మీ సేవా కేంద్రాల్లో ఆన్లైన్ చేసి, సంబంధిత ఎస్బీఐ బ్యాంకు వారికి లేదా సీఎంపీఎఫ్ వారికి అందజేయాల్సి వుంటుందని సూచించారు.

# అహల్యాబాయి జయంతి వేడుకలు...



టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం కండోభ ఆలయం వద్ద శ్రీ లోకమాత దేవి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆమె మాల్వ రాష్ట్రాన్ని పాలించిన గొప్ప రాణి మాత్రమే కాకుండా, బడుగు బలహీన వర్గాల కోసం కృషి చేశారని కొనియాడారు. ఆమె పాలనలో ప్రజలకు న్యాయం, సమానత్వం లభించాయన్నారు. ఆమె పుణ్య కార్యాల వలన దేశవ్యాప్తంగా అనేక ఆలయాలను ,ధర్మశాలలను ,ఘాట్లను నిర్మించారని అన్నారు. వారణాసిలో కాశి విశ్వనాథ ఆలయం పునఃనిర్మాణం ఆమె చేతుల మీదుగా జరగడం మనందరి గర్వ కారణమని అన్నారు. ఆమె జీవిత చరిత్ర మనకు ధైర్య, నిస్వార్థ సేవ భావం, ధర్మబద్ధతకు నిదర్శనమని అన్నారు. ఆమె సేవలు మారువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు సిరిగిరి రామ్ ,కార్యదర్శి సిరిగిరి గౌర్ గొండా ,సిరిగిరి అశోక్, సభ్యులు నాగ్ గొండా, శ్రీనివాస్, శివకాంత్, పీరాజి, సుధాకర్, జలంధర్, మాధవరావు, సాయిలు, ఈరుగొండ, విట్ఠల్ తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్‌లో దారుణం

మద్యం ఇచ్చేందుకు నిరాకరించిన యువకుడిని ఇద్దరు బాలురు దారుణంగా హత్య చేసిన సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున 2గంటలకు చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్ కథనం ప్రకారం. మణికొండ, ఖాజాగూడకు చెందిన జయంత్‌గౌడ్ (18) శుక్రవారం తన తల్లి లక్ష్మి పుట్టిన రోజు కావడంతో కేక్‌ను తీసుకువద్దామని రాత్రి 10 గంటల సమయంలో స్నేహితులతో కలిసి కొండాపూర్ వచ్చి కేకును తీసుకొని జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం స్నేహితులతో కలిసి హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రి వెనుక వైపు ఉన్న ఉన్న నిర్మానుశ్య ప్రాంతానికి మద్యం సేవించడానికి వెళ్లారు. జయంత్‌గౌడ్‌తో పాటు అతడి స్నేహితులు మరో 7 మంది కలిసి మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలోనే రాత్రి 1.30 గంటల సమయంలో మద్యం సేవిస్తుండగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి మూత్రవిసర్జనకు వచ్చారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలి

### తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశం




టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్

ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను నిర్మించుకుంటున్న లబ్దిదారులకు ఇసుక, మొరం అందుబాటులో ఉండేలా చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తహసీల్దార్లకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం తహశీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో లబ్దిదారులను అన్ని విధాలుగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చే వారికి సరిపడా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్దిదారులకు ఇసుకను రవాణా చేసే వాహనాలకు ప్రత్యేకంగా జారీ చేసిన వే బిల్లులను అందించాలని, అనుమతుల విషయంలో అనవసర ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరిట ఇసుక పక్క దారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే ఎంపీడీఓలు, ఎంపీఓలను సంప్రదించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్దిదారులను నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. వర్షాలు ప్రారంభం అయితే వాగులు, నదులలో వరద జలాలు చేరుకొని ఇసుక లభించే పరిస్థితి ఉండదని, దీనిని దృష్టిలో పెట్టుకుని వానలు కురియకముందే సరిపడా ఇసుక నిల్వలను ఇందిరమ్మ లబ్దిదారులు ముందస్తుగా సమకూర్చుకునేందుకు వారికి వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. ఎక్కడ కూడా ఇసుక కొరత కారణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయనే ఫిర్యాదులు రాకూడదని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
ఆదివారం,
01-06-2025


# 'భూభారతి'రెవెన్యూ సదస్సులను సమర్ధవంతంగా నిర్వహించాలి

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం కింద భూ సంబంధిత సమస్యలపై రైతులు, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు వీలుగా జూన్ 3 నుంచి అన్ని మండలాలలో గ్రామాల వారీగా చేపట్టనున్న రెవెన్యూ సదస్సులను సమర్ధవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లకు రెవెన్యూ సదస్సుల నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూభారతి చట్టంలోని నిబంధనల గురించి, దరఖాస్తులను పరిష్కరించాల్సిన తీరును తెలియ జేశారు. ఇప్పటికే పైలెట్ ప్రాతిపాదికన జిల్లాలోని మెండోరా మండలంలో గల ఎనిమిది గ్రామాలలో రెవెన్యూ సదస్సులను జరిపి, క్షేత్రస్థాయి విచారణ నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అదే తరహాలో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిశీలన, విచారణ ప్రక్రియలను నిర్వహించాలని అన్నారు. జూన్ 3 నుంచి 20వ తేదీ లోపు రెవెన్యూ సదస్సులను విజయవంతంగా పూర్తి చేయాలని గడువు విధించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు సదస్సులు ప్రారంభం కావాలని, సాయంత్రం వరకు అందుబాటులో ఉంటూ దరఖాస్తులు స్వీకరించాలన్నారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ రెవెన్యూ బృందాలు సకాలంలో గ్రామాలకు చేరుకోవాలని, సదస్సుల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఒకటి, రెండు రోజుల ముందే ఆ ప్రాంత రైతులు, ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే చోట తాగునీరు, సరిపడా నీడ, కుర్చీలు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ కోసం కౌంటర్ ఏర్పాటు చేయాలని, దరఖాస్తుదారులకు సహకరించేలా హెల్ప్ డెస్క్ ను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా దరఖాస్తులు దాఖలు చేసేలా చూడాలని, రిజిస్టర్లలో సమగ్ర వివరాలను నమోదు చేస్తూ, పూర్తి డాటాను కంప్యూటర్ ఆన్లైన్ లోనూ పొందుపర్చాలని ఆదేశించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించాలని, మొక్కుబడిగా కాకుండా ప్రతి అంశాన్ని ఎంతో జాగ్రత్తగా, సమగ్రంగా పరిశీలించాలని హితవు పలికారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, భూభారతిలోని నిబంధనలపై పరిపూర్ణమైన అవగాహనను కలిగి ఉన్నప్పుడే, తప్పిదాలకు తావులేకుండా దరఖాస్తుల పరిశీలన, విచారణ ప్రక్రియలను నిర్వహించగల్గుతారని అన్నారు. ముందుగా డెస్క్ వర్క్ ద్వారా రెవెన్యూ రికార్డులతో దరఖాస్తులోని వివరాలను సమగ్రంగా పరిశీలన చేసుకోవాలని, అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి నిబంధనలకు అనుగుణంగా విచారణ జరపాలన్నారు. ఎలాంటి ఆరోపణలు, విమర్శలకు తావు లేకుండా, విచారణ ప్రక్రియను పూర్తి నిబద్ధత, నిజాయితీగా నిర్వహించాలని సూచించారు. అవకతవకలకు తావు కల్పిస్తే ప్రభుత్వ యంత్రాంగానికి, రెవెన్యూ వ్యవస్థకే చెడ్డ పేరు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు తలొగ్గకుండా భూభారతి దరఖాస్తుల విచారణలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందరూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ హితవు పలికారు. కావాలని తప్పిదాలకు తావు కల్పిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని, సస్పెండ్ చెంసేందుకు కూడా వెనుకాడబోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. భూభారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థను అమలు చేస్తున్నందున, ప్రతి దరఖాస్తును ఎంతో జాగ్రత్తగా పరిష్కరించాల్సి ఉంటుందని, దరఖాస్తుదారుడు తిరిగి అప్పీలుకు వెళ్లే పరిస్థితి ఉత్పన్నం కాకుండా నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణ జరిపి వాస్తవ పరిస్థితులతో కూడిన అభిప్రాయాలను నివేదికలో పేర్కొనాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ ప్రక్రియలు నిర్వహించే సమయంలో ప్రతి ఒక్కరు సంయ మనంతో వ్యవహరించాలని అన్నారు. సాదాబైనామాలు, పీ.ఓ.టీ దరఖాస్తులకు సంబంధించి రికార్డుల పరిశీలన, సాధారణ విచారణలు మాత్రమే జరపాలని, హైకోర్టులో స్టే తొలగిన మీదట, ప్రభుత్వం వెలువరించే మార్గదర్శకాలకు అనుసరిస్తూ సాదాబైనామా, పీ.ఓ.టీలను క్రమబద్దీకరించడం జరుగుతుందని దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఒకే దరఖాస్తులో ఒకటికంటే ఎక్కువ సంఖ్యలో భూ సమస్యలను పొందుపరిస్తే, ప్రతి సమస్యను తప్పనిసరిగా పరిశీలిస్తూ వేర్వేరుగా విచారణ జరపాలని అన్నారు. అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, అన్ని మండలాల తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఆర్.ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## వక్ఫ్ చట్ట సవరణపై ముస్లింల నిరసన...




టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

జాయింట్ యాక్షన్ ఆఫ్ ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆధ్వర్యంలో మజ్లీస్ సంస్థల ఆధ్వర్యంలో వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ బోధన్ పట్టణంలో శనివారం ముస్లింలు నిరసన తెలిపారు. వక్ఫ్ భూముల పై ప్రభుత్వ పెత్తనం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు.జాతీయ పతాకలతో అంబేద్కర్ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు.వక్ఫ్ చట్ట సవరణను వెనకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలోకమిటీ అధ్యక్షులు మౌలానా ముఫతి అతిక్ అహ్మద్, మౌలానా లాయర్ అహ్మద్ , ముఫ్తీ జబైర్ ఇషాతి,ఆబిద్ ఫారుకి,సమీ అహ్మద్,మీర్ ఇలియాజ్ అలీ,ఖదీర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాలను కలిసిన పద్మశాలి సంఘం కార్యవర్గం

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



నూతనంగా ఎన్నుకోబడిన పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తాను కలిశారు. ఇటీవలే పద్మశాలి కుల సంఘం ఎన్నికల్లో గెలుపొందిన నూతన అధ్యక్షులు పెంట దత్తాద్రి కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాలను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపి వారిని శాలువాలతో సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే బీగాలను కలిసిన వారిలో పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఎనుగందుల మురళి, కన్న దుబ్బరాజ, బాగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చౌటి భూమేశ్వర్, కార్యదర్శులు అవధూత రాములు, ఎనుగందుల సుభాష్, భూసరవి, కోశాధికారి మోర సాయిలు, ప్రచార కార్యదర్శి బూస శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి గంగరాజు, కులసంఘం నాయకులు సత్యపాల్, బిల్లా మహేష్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

## జూన్ 2 నాటి ప్రజావాణి వాయిదా

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకల నేపథ్యంలో జూన్ 2 వ తేదీన జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. తిరిగి జూన్ 9వ తేదీ నుంచి ప్రతీ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని అన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

## శ్రీ పాండురంగ విఠలేశ్వర ఆలయ రెండవ వార్షికోత్సవం

టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్



మాక్లూర్‌లో గల శ్రీ రుక్మిణి పాండురంగ విఠలేశ్వర ఆలయ, రెండవ వార్షికోత్సవం, ఆలయ నిర్మాణ కర్త,నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్లె బిగాల గణేష్ గుప్త ఆధ్వర్యములో,శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగు రంగులపూలతో. అలంకరించి ఉదయం నుండి వేదపండితుల ఆధ్వర్యములో ప్రత్యేకపూజలు నిర్వహించారు. బుధవారం జేష్ఠ శుక్లపంచమి తిథి న.శ్రీ శంకరచార్య విద్యారణ్యభారతి స్వామి కారకరములచె ప్రతిష్టపిం చారు. తిథి ప్రకారం శనివారం 31.05.2025 జేష్ఠ శుక్లపక్షం పంచమి సందర్భంగా, ఆలయ రెండవ వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం శుప్రబాతసేవ పండ్ల రసాలచే మూల విగ్రహాలకు అభిషేకం, పుణ్యావాచనం, నవగ్రహ అష్టదిశ మండప క్షేత్రప్రోక్షణ, ప్రధాన ఆలయ జలప్రోక్షన, తులసిదల పూజలు, మంత్రాపుస్పం,ఆరతి గావిం చి, గోదానం చేశారు. వేద పండితులు నరసింహుల సురేష్ శాస్త్రి,నరసింహుల రవి ఆధ్వర్యాన వేదమంత్రాలతో నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదంగ అన్నదానకార్యక్రం నిర్వహించారు.

## పశువుల అక్రమ రవాణా చేస్తే చర్యలు.. సీపీసాయి చైతన్య...



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి / రెంజల్

పశువుల అక్రమ రవాణా,ఆవులు,దూడల విక్రయం చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని సీపీసాయి చైతన్య హెచ్చరించారు.శనివారం సాటాపూర్ పశువుల సంతను ఆయన తనిఖీ చేశారు.ఈమేరకు వాహనాల్లోతరలిస్తున్న పశువులను స్వయంగా తనిఖీ చేశారు.పశువుల కొనుగోళ్లకు సంబందించిన పత్రాలను పరిశీలించి, అక్కడ ఉన్న రిజిస్టర్ లను తనిఖీ చేశారు. బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకుని ఆవులు, దూడలను విక్రయించవద్దని స్పష్టం చేశారు.పశువుల కొనుగోలు, విక్రయాలు జరిపేటప్పుడు తప్పనిసరిగా పశుసంవర్ధక శాఖ డాక్టర్ ధృవీకరణ పత్రం తీసుకోవాలని,అలాగే గ్రామ పంచాయతీ రసీదు కూడా పొందాలని సూచించారు. పెద్ద మొత్తంలో పశువులను రవాణా చేయకూడదని ఆయన ఆదేశించారు. పశువుల అక్రమ రవాణా,ఆవులు, దూడల విక్రయాలపై పోలీసులు నిఘా ఉంచుతారని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటారని ఆయన హెచ్చరించారు.సీపీ వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్ఐ. చంద్ర మోహన్, తదితరులు ఉన్నారు..

## ఎడపల్లి పిహెచ్సిలో అంతర్జాతీయ యోగా శతాబ్ది ఉత్సవాలు

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



ఎడపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈవేడుకలు ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించడం,ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహించబడుతున్నాయని యోగా శిక్షకులు అశోక్, స్రవంతిలు పేర్కొన్నారు.యోగాశిక్షకులు ఆసనాలు, ప్రాణాయామం,ధ్యానం వంటి వివిధ యోగా పద్ధతుల గురించి వివరించారు.గత నెల 27నుండి ఈ నెల 21 వరకు 25రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా యోగా యొక్క ఆరోగ్య ప్రయోజనాలు, శారీరక, మానసిక శ్రేయస్సుపై దాని ప్రభావం గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.. ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని, యోగా అనేది పురాతన భారతీయ సంప్రదాయం మనకు అందించిన అమూల్యమైన బహుమతి అని అన్నారు. ఇది శరీరం, మనసు, ఆత్మల మధ్య ఐక్యతను సాధించడానికి సహాయపడుతుందని, ఆధునిక జీవనశైలి వల్ల కలిగే ఒత్తిడి, ఆందోళనల నుండి ఉపశమనం పొందడానికి యోగా ఒక గొప్ప సాధనంగా పనిచేస్తుందని పేర్కొన్నారు ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఈ వేడుకలు ప్రజల్లో యోగా పట్ల ఆసక్తిని పెంచి, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకునేలా ప్రోత్సహిస్తాయని శిక్షకులు, పిహెచ్సి వైద్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలు తెలుసుకుని,ఆరోగ్యవంతమైన,ఆనందకరమైన జీవితాన్ని గడుపుతారని వైద్యులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వినీత్ రెడ్డి, ఆయుర్వేద వైద్యులు వెంకటేష్, పిహెచ్సి వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎడపల్లిలో ముగిసిన అన్నదాన కార్యక్రమం...



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

నిజామాబాదు జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పేదలకు, వృద్ధులకు సాయిబాబా ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన ఉచిత అన్నదాన కార్యక్రమం శనివారంతో ముగిసింది.మేనెల 1న ప్రారంభమైన ఉచిత నిత్యాన్నదాన కార్యక్రమం నెల రోజుల పాటు నిరాటంకంగా కొనసాగింది.ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వర శర్మ మాట్లాడుతూ... వేసవికాలంలో పేదవారికి, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని,ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం మే నెలలో నెల రోజులపాటు నిర్వహిస్తామన్నారు.ఆకలితో అలమటించే పేదవారికి,వృద్ధులకు అన్నదానం చేయడమనేది తనకు దక్కిన అదృష్టమని పేర్కొన్నారు. నెల రోజుల పాటు నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఎంతో మంది పేదలు అన్నప్రసాదాన్ని స్వీకరించడం జరిగిందని అన్నారు. బాబా ఆశీస్సులు తనపై ఉన్నందున ఇంతటి మహత్కార్యం చేపట్టేందుకు అవకాశం వచ్చిందని పేర్కొన్నారు.మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎల్లవేళలా ముందుంటామన్నారు. ప్రతి గురువారం ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమం కొనసాగుతూ ఉంటుందని వివరించారు. అలాగే ముగింపు కార్యక్రమానికి హాజరైన జడ్పీ మాజీ చైర్మన్ రజిత యాదవ్ మాట్లాడుతూ.ఎండాకాలంలో పేదలకు,వృద్దులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు.అనంతరం ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వర శర్మ శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎడపల్లి ఎంపీడీఓ,ఎంపీవో మన్మోహన్ శాస్త్రీ, మాజీ సర్పంచ్ నాయుడు శంకర్, సెక్రటరీలు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్..

టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్



బోధన్ పట్టణం లయన్స్ కంటి ఆసుపత్రి వెనకాల రైల్వే స్టేషన్ ప్రక్కన పేకాట అడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం పేకాట ఆడుతున్న ఐదుగురుని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి ఆరు మొబైల్ ఫోన్ లు, రెండు ద్విచక్ర వాహనాలు, 1,970రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## రెవెన్యూ ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి సేవా నిర్వహించడం అభినందనీయం

**జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

**స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 60 మంది ఉద్యోగులు**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ




రెవెన్యూ ఉద్యోగులు హెల్పింగ్ హార్ట్స్ పేరుతో స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ప్రశంసించారు. తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ తరపున రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు లోక రామణ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించగా, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు వివిధ శాఖలకు చెందిన సుమారు 60 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. తలసేమియా పేషెంట్ల కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయమని ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. అన్ని దానాలలోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ఉపకరిస్తుందని గుర్తు చేశారు. హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ నెలకొల్పి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ద్వారా ప్రతీ ఏటా ఈ తరహా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండడం ముదావహమని, ఇదే స్ఫూర్తితో మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రక్తదానం చేసిన ఉద్యోగులకు రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరపున ప్రశంసా పత్రాలు అందజేశారు. రెడ్ క్రాస్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లోక రమణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, భూపతి ప్రభు, అసోసియేషన్ ప్రతినిధులు మహేష్, శ్రీనివాస్, తహసీల్దార్ సత్తయ్య రెడ్డి, రెడ్ క్రాస్ బాధ్యులు బుస్స ఆంజనేయులు, తోట రాజశేఖర్, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
ఆదివారం,
01-06-2025


# దేశం,ధర్మంకోసం శాఖ నడపాలి...

## ఇందూర్ విభాగ్ ప్రచారక్ నర్ర వేంకట్ శివకుమార్

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



దేశం, ధర్మంకోసం ఆర్ఎస్సెస్ శాఖ నడపాలని, హిందూ అనే పదం మతంకాదని జీవన విధానమి ఇందూర్ విభాగ్ ప్రచారక్ నర్ర వేంకట్ శివకుమార్ అన్నారు. శనివారం ఎడపల్లి మండలం ఠాణకలాన్ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరిగిన రాష్ట్రీయ స్వంయం సేవక్ సంఘం ఏడపల్లి ఖండ ఆధ్వర్యంలో ప్రారంభిక్ వర్గ ముగింపు కార్యక్రమంలో వక్తగా పాల్గొన్న ఆయన ఈసందర్భంగా మాట్లాడారు. ఆర్ఎస్సెస్ సంఘం 1925లో స్థాపించి వందేళ్ళు గడిచిందని ఈ శతవసంత ఉత్సవాలలో లక్ష శాఖలను లక్ష గ్రామాలలో కోనసాంపు లక్ష్యమే పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం దేశంలో ఆరున్నర లక్షల గ్రామాలలుండగా ప్రస్తుతం 90వేల శాఖలున్నాయని లక్ష గ్రామాలలలో శాఖలు కోనసాగుతున్నాయన్నారు. సంఘం అనేది గంగాప్రవాహం లా నిత్యం, నిరంతరం పని జరుగుతునే ఉండాలని, ఇందులో భాగంగా రోజు గంట శాఖ తప్పక నడుపుతుందన్నారు.ఏ సంస్థ ఇలా ఉండదని పనిచేయదని గుర్తుచేశారు. సంఘం ఎవరిని వ్యతిరేకించదని, ద్వేషించదని, దేశ హితం కోసం నిరంతరం హిందూ సమాజాన్ని, సంస్కరించడం, సంఘటితం చేయడం కోసమే పని చేస్తుందన్నారు. ఒక్క హిందూవు బతికున్నా ఇది హిందూ రాష్ట్రమే అని వివేకానందుడు అన్నాడన్నారు. సర్వే సంతు నిరామయం అనే బావనతో సంఘం పనిచేస్తుందని, ఆర్ఎస్సెస్ పాకిస్తాన్ నాశనం కోసం పూజలు చేసే రకం కాదన్నారు.ధర్మహింస దద్దైవచః ధర్మ అను వివరిస్తు రక్షణ కోసం దాడులు సరియైనవే అన్నారు.ఎంతో మంది రాజులు భారతదేశాన్ని దండయాత్ర చేసి వారికి పట్టిన గతి, వారు ఎదుర్కొ ఓటమి ఘటనలను వివరించారు. హిందు సమాజం మన విలువలు, దైర్యం, మరిచిపోయామని ప్రస్తుతం ప్రపంచం లో 125 క్రైస్తవ దేశాలు, 56 ముస్లిం దేశాలున్నాయన్నారు. దేశం, ధర్మ సంరక్షణ కోసం సంఘం పని చేస్తుందని దేశ శక్తి చాటడానికే అణుశక్తి తయారు చేసుకు న్నామని,ఉగ్రవాదుల నిర్మూలన మన దేశం లక్ష్యమన్నారు. హిందూ సమాజం తనను తాను కాపాడుకోనే విధంగా తయారు కావాలని, మన వ్యతిరేక శక్తులను ఎప్పటికప్పుడు ఎదుర్కో వాలన్నారు.లవ్ జీహద్ పేరిటా ఇప్పటికి 70లక్షల మంది మతం మారారన్నారు. ఉరిలో ఉ ఒడే ప్రతి ఒక్కరు ఓక్కటై సంఘటితంగా ఉండి అందరిలో భగవంతుని చూసే విధానం కేవలం హిందువులలోనే ఉ ఒటుందన్నారు. మనిషిలో శరీరం మనస్సు,బుద్ది, ఆత్మ, ధైర్యం కల్గి ఉండాలని,అందుకే పూర్వకాలంలో భగవత్ బందువు లారా అని రుషులు అనిపిలిచే వారన్నారు.. అందుకే ఆర్ఎస్ఎస్ భారతమాతను తల్లిగా భావించే ప్రతి హిందూ ను గౌరవిస్తుందని, దేశభక్తి లేకపోతే ఉండలేం అని ముస్లింలకు అర్థమై గుర్తించారన్నారు. దేశం కోసం ధర్మకోసం శాఖ నడుపాలని ప్రతి రోజు శాఖలో క్రీఢలు,సూర్యనమ స్కారాలు, క్రమశిక్షణ, ధైర్యం, శారీరక ఉల్లాసం వస్తుందన్నారు.పరమ వైభవం సాదించే దిశగా శాఖ నడపాలని, అప్పుడే 24 గంటలు ఆరోగ్యంగా ఉంటామన్నారు.లక్ష గ్రామలలో మన గ్రామం ఉండాలంటే శాఖ, ప్రార్థన జరుపాలని అప్పుడే దేశభక్తి పేంపోందింది దేశం కోసం భాగస్వామ్యం కావాడం ఖాయమన్నారు. ఈ ప్రారంబిక్ వర్గలో ఎడపల్లి ఖండ 8 గ్రామాల నుంచి 32 మంది శిక్షార్థులు,10 మంది ప్రబంధక్ లు అమృత వచనాలు, వైయక్తిక్ గీత్, వివిధ కార్యక్రమాలు జరిగాయి.ఈ కార్యక్రమం లో ప్రారంబిక్ వర్గ్ నీలంకంఠం, పరుశురాం ఖండ కార్యావాహ,వివిధ గ్రామాల పూర్వ స్యయం సేవకులు,పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ అవగాహన సదస్సు




టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

రోటరీ క్లబ్ నిజామాబాద్ ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ - తెలంగాణ స్టేట్ బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ అవగాహన సదస్సును స్థానిక ఖలీల్వాడిలో గల డాక్టర్ విశాల్స్ ఆల్కహాల్, డ్రగ్ డి అడిక్షన్ అండ్ రిహబిలిటేషన్ సెంటర్ లో వహించినట్లు ఇన్చార్జ్ అధ్యక్షులు శ్యామ్ అగర్వాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వక్తగా ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ప్రొఫెసర్ రొటీరియల్ డాక్టర్ విశాల్ ఆకుల హాజరై సందర్శకులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి సమాజంలో పొగాకు, గంజాయి, గుట్కా, తదితర మత్తుపదార్థాలు యదేచ్చగా లభ్యం అవుతూ ప్రజలకి ముఖ్యంగా యువతకి పరోక్షంగా హాని కలిగిస్తున్నాయని, వీటి భారీ నుంచి కాపాడుకోవడం కుటుంబంలోని పెద్దల యొక్క బాధ్యతాని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ ప్రదేశాలలో అనేక రకాల కార్యక్రమాలు పొగాకు వలన కలిగే నష్టాలతో కూడిన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వీరు తెలియజేస్తూ వీటి వలన మానసిక స్థితియే కాకుండా హానికరమైన రోగాలు దరి చేరుతాయని పిమ్మట జీవితం నాశనం అవుతుందని అన్నారు. అందుకే ప్రజలు సురక్షితమైన ఆహారాన్ని భుజిస్తూ దినచర్యలో తగినంత సమయం ధ్యానం, వ్యాయామం, సాద్వికమైన ఆహారం అలవాటు చేసుకుని ఆనందదాయకమైన జీవనాన్ని గడపాలని కోరారు. తదనంతరం పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ప్రముఖ న్యాయవాది రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు రావులపల్లి జగదీశ్వర్ రావు, శ్రీకాంత్ జవహర్, గోవిందు జవహర్, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# టీజేఎఫ్ 25వ వసంతాల సభ

## హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లిన జర్నలిస్టు సంఘం నాయకులు..




టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

హైదరాబాద్ (భాగ్యనగర్) మహానగరంలోని నెక్లెస్ రోడ్ జలవిహార్ ప్రాంగణంలో ఈరోజు నిర్వహించే తలపెట్టిన తెలంగాణ జర్నలిస్టు ఫోరం రాజతోత్సవ మహాసభలో పాల్గొనడానికి శనివారం బాన్సువాడ నుండి బయలుదేరి వెళుతున్న ఆ సంఘం జిల్లా శాఖ ప్రతినిధులు. బయలుదేరి వెళ్లిన వారిలో టియుడబ్ల్యూజే టి జె ఎఫ్ కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబిలిపూర్ రాజు, జిల్లా ప్రతినిధులు యండమూరి వరప్రసాద్, గాంధారి పండరి గౌడ్, ఏర్ల శ్రీనివాస్, చిలువేరి రాజు, కట్టాల సంపత్ గౌడ్, తదితరులు, ఉన్నారు.లి

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మంత్రి అంజవ్వ గణేష్ పంపిణీ చేశారు .పేదలకు ఈ పథకం వరం లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజం సాగర్ డిస్ట్రిబ్యూటర్ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి ,ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బోయిని రవీందర్, గ్రామ అధ్యక్షుడు బండి సాయిలు, లబ్ధిదారులు, తదితరులు, పాల్గొన్నారు.

# ఏరియా నుండి ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-






తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకను పురస్కరించుకొని ఏరియా నుండి ఉత్తమ అధికారి, ఉత్తమ ఉద్యోగిని ఎన్నుకోవడం జరిగిందని సింగరేణి ఏరియా యాజమాన్యం శనివారం ప్రకటనలో తెలిపారు. ఏరియా నుండి ఉత్తమ అధికారిగా ఏరియా జిఎం కార్యాలయ నుండి ఏరియా అడిషనల్ జిఎం, ఈ అండ్ ఎం వై వెంకటరమణ ఎంపికైయ్యారు. ఈయనను కొత్తగూడెంలోని ప్రకాష్ స్టేడియం లో నిర్వహించు సెంట్రల్ ఫంక్షన్లో సింగరేణి సిఎండి ఎన్ బలరాం చేతుల మీదుగా సన్మానంతో పాటు ప్రశంసా పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఉత్తమ ఉద్యోగిగా ఏరియాలోని కేకే 5 గని చెందిన కోల్ కట్టర్ టీ సునీల్ కుమార్ ఎంపికైయ్యారు. ఈయనను పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించు ఆవిర్భావ వేడుకల్లో ఏరియా జిఎం జి దేవేందర్ చేతుల మీదుగా చేతుల మీదుగా సన్మానంతో పాటు ప్రశంసా పత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు.

# జిలుగు విత్తనాలు పంపిణీ

టైమ్స్ ఆఫ్ వార్త -గాంధారి



గాంధారి మండల కేంద్రం లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అధ్వర్యంలో జిలుగు విత్తనాలు పంపిణి చేసిన సొసైటీ చైర్మన్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసిసిబి, డిసిఎంఎస్ డైరెక్టర్ పెద్దబూరి సాయి కుమార్ వైస్ చైర్మన్ ఉధల్ సింగ్, మండల AO రాజలింగం అందజేశారు. ఈ కార్యక్రమములో గాంధారి తాజా మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ ,సొసైటీ డైరెక్టర్లు గాండ్ల లక్ష్మణ్, ఆర్ల శివాజీ రావు, గోవింద్ గణపతి రావు, కోనింటి మణెవ్వ పోచయ్య, సొసైటీ సీఈఓ గాండ్ల సాయిలు , రైతులూ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామ పంచాయతీలో బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వెంకటరమణ దేశ్ముఖ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను గ్రామస్తులకు వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నబి, పంచాయతీ సెక్రెటరీ భరత్, పాఠశాల చైర్మన్ విట్టవ్వ, తదితరులు, పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాద పరిషత్ నాయకులు



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కె. సృజన ను న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్, న్యాయవాదులు స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. వారితో మాట్లాడుతూ గతంలో వారు నిజాంబాద్ జిల్లా జడ్జిగా పని చేసిన సమయంలో వారు ఈ జిల్లాకు సంబంధించిన న్యాయ సేవలను గుర్తు చేయిస్తూ వారితో మాట్లాడారు. వారిని కలిసిన వారిలో న్యాయవాదులు బిట్ల రవి, పిల్లి శ్రీకాంత్, వసంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బిచ్కుంద మున్సిపల్ కమిషనర్ గా ఖయ్యూం

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ డివిజన్ పరిధిలోని బిచ్కుంద మండల కేంద్రం నూతన మున్సిపల్ కమిషనర్ గా ఖయ్యూం శనివారం బాధ్యతలు స్వీకరించారు .ఆర్మూర్ మున్సిపల్ లో మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న ఖయ్యూం ను ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ, బిచ్కుంద నూతన మున్సిపల్ కమిషనర్ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బిచ్కుంద మండల పార్టీ నాయకులు ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు..

# పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యాంగా జీవించండి..



టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్

పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యాంగా జీవించండని, మాక్లూర్ పోలీసులు ప్రజలకు, పొగాగు తినడం,తాగడం,వలన కలిగే నష్టాల గురించి అవగాహన కలిగించారు.ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా,మాక్లూర్ గ్రామంలో ప్రజలలతో మాట్లాడుతూ, వయసుతో సంబంధం లేకుండా పొగాకు వినియోగం ప్రమాదమని తెలిసినా,పోగాకు వినియోగించే వారు పెరిగి ఆరోగ్యం చెడి, కుటుంబానికి దూరమౌతున్నారని అన్నారు.సరదాగా మొదలై వ్యాసనం లామారి,ప్రాణాలు తీస్తోందని.ఐనా ఈమహమ్మారి మత్తులోపడి యువత బలైపోతున్నారన్నారు. పొగతాగే వారికే కాకుండాపొగపీల్చే వారికి ప్రమాదం ఎక్కువ అని, మీ కుటుంబాన్ని పిల్లల భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని, ఇకనైనా పొగతాగడం మానేయండని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవి, పీరుబాయి, కానిస్టేబుల్ సుదర్శన్ పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి ఉద్యమకారులను ఆహ్వానించండి..

## జిల్లా కన్వీనర్ ఉడుత గంగాధర్ గుప్తా

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి మలిదశ ఉద్యమకారులను గుర్తించి ఆహ్వానించాలని ఉద్యమకారుల ఫోరమ్ కామారెడ్డి జిల్లా కన్వీనర్ ఉడుత గంగాధర్ గుప్తా శనివారం జిల్లా కలెక్టర్ లను కోరారు. కామారెడ్డి జిల్లా కార్యాలయములో కలెక్టర్, బాన్స్ వాడ సబ్ కలెక్టర్, తహసీల్దార్ నీ కలసి రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల త్యాగ ఫలితమే జూన్ 2 వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినముగా గుర్తించి ఆవిర్భావ ఉత్సవములలో భాగంగా ఉద్యమకారులకు ఆహ్వానించవలసినదిగా కోరడమైనది. ఇట్టి కార్యక్రమం లో ఉద్యమకారుల ఫోరం కామారెడ్డి జిల్లా కన్వినర్ ఉడుత గంగాధర్ గుప్త బాన్స్ వాడ మండల ప్రధాన కార్యదర్శి గంజివార్ చందు, భీమా నాయక్, రాంచందర్,ఎర్రవటి సాయిబాబా, కృష్ణ, భాస్కర్ గౌడ్, రాజు,పవన్ తదితరులు పాల్గొన్నారు.



# హై కోర్టు జడ్జి ని కలిసిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య




టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ క్రైమ్

హై కోర్టు జడ్జి కె. సృజన ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మర్యాద పూర్వకంగా కలిశారు. హైకోర్టు న్యాయమూర్తి సృజన శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా సుభాష్ నగర్ లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిసి పువ్వుల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా హై కోర్టు జడ్జి పోలీస్ కమీషనర్ స్వాగతిస్తూ అభినందించారు.



since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
ఆదివారం, 01-06-2025
6

# బిఆర్ఎస్‌లో చిచ్చు పెట్టింది బీజేపీ అగ్ర నాయకత్వం కాదా

సత్యం శ్రీరంగం సూటి ప్రశ్న!

బిఆర్ఎస్, బిజెపి..ఇవాళ గొడవ, రేపు కలయిక! ఇదే కదా ఊసరవెల్లి రాజకీయాలు.

కాంగ్రెస్ కు వస్తున్న ఆదరణను డైవర్ట్ చేయాలని కొత్త నాటకాలు ఆడుతున్నారు

టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి





గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ బీజేపీ, బిఆర్ఎస్ ఒక్కటే అని మేము మొదటి నుంచి చెబుతున్నామని, కవిత మాటలతో ఆ విషయం ఋజువు అయిందని, బిఆర్ఎస్, బీజేపీలో విలీనం చేయాలని చూస్తున్నారు అని కవిత ఇప్పుడు అంటుంది, ఆల్రెడీ కేసీఆర్ బిఆర్ఎస్ ను ఎప్పుడో బీజేపీ లో కలిపిండు, మేము 2023 లోనే బీజేపీ, బిఆర్ఎస్ లు ఒక్కటే అని అప్పుడు పీసీసి అధ్యక్షుడు, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిండు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ బలపడుతుందో ఆనాడు కేసీఆర్ జాతీయ పార్టీ అని కేసీఆర్ కొత్త డ్రామా లేపిండు అని అన్నారు. బిఆర్ఎస్ తో లోపాయికారి ఒప్పందం తోనే ఎంపీ ఎన్నికల్లో బిఆర్ఎస్ వల్లే బీజేపీ 8 ఎంపీ సీట్లు గెలిచిందని అన్నారు. 10 ఏళ్లు బీఆర్ఎస్ పార్టీ మోసం చేసి, అన్ని వర్గాలను మోసం చేస్తూ దారుణమైన పరిపాలన చేశారు అని, ప్రజల సమస్యలపై ఒకటి కూడా మాట లేదు, కానీ అధికారం కోసం మాత్రం ప్లాన్లు ఫుల్లు చేస్తారన్నారు. ఒక్కో ఎన్నిక వచ్చినప్పుడు ఒకరిని తిడితే, ఎన్నికల తర్వాత మళ్ళీ చేతులు కలుపుతారు అని అన్నారు. కల్వకుంట్ల పార్టీ మునిగి పోయే నావ కాంగ్రెస్ పార్టీ ని నమ్ముకొని ఎవరు మునిగి పోలేదు దానికి ఉదాహరణ మీ నాయన కేసీఆర్ కాంగ్రెస్ ను నమ్ముకొని మీ నాయన కేసీఆర్ ఎదిగిండు, దేశ ప్రజాస్వామ్యం ఉన్నంత వరకు కాంగ్రెస్ బ్రతికే ఉంటుంది అని అన్నారు. బీజేపీ నేతలు ఎలా అమ్ముడు పోయారో రాజాసింగ్ చెప్పారని, ఆయన ఆరోపణలపై కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటలకు సమాధానం చెప్పే దమ్ముందా అని అన్నారు. బీఆర్ఎస్ మూడు ముక్కలాటలో సూత్రదారులు, పాత్రధారులు బీజేపీ పార్టీ నే అని అన్నారు. ఈ దేశంలో ఏ ప్రాంతీయ పార్టీనైనా మీతో స్నేహం చేసిన పాపానికి తిమింగలం లెక్క మింగేస్తారు అది మీకున్న నైజం అని అన్నారు. ఆ ప్రాంతీయ పార్టీలకు జీవ సత్వాలు లేకుండా నాశనం చేసే పార్టీ బీజేపీ అని అన్నారు. ఆ కుటుంబం మధ్య చిచ్చు పెట్టింది బీజేపీ నాయకులు కాదా? బండి సంజయ్ రేవంత్ రెడ్డి దేశ ద్రోహి అంటుండు, సీజ్ ఫైర్ ఎందుకు అమలు చేశారు, దేశ ప్రజలకు తెలియ జేయండి అనడం దేశ ద్రోహమా? బండి సంజయ్,కిషన్ రెడ్డి కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడటం దౌర్భాగ్యం. ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన సాగిస్తుండు 17నెలల కాలంలో చెప్పినవి, చెప్పనవి అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నం అని అన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక అర్హత బండి సంజయ్, కిషన్ రెడ్డి లకు లేదన్నారు. ట్రంప్ ప్రలోభాలకు ప్రధాని మోదీ లొంగిపోయారని, దేశ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన వాళ్ళు రాహుల్ గాంధీ పై విమర్శలు చేస్తున్నారని, యుద్ధ టైంలో కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇచ్చిందని, సైనికులకు రాహుల్ గాంధీ అండగా నిలిచారని అన్నారు. ట్రంప్ కి తలొగ్గి యుద్ధం ఎందుకు అపారని దేశ ప్రజలు ప్రశిస్తున్నారని, మోదీ, కేంద్ర మంత్రులు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు..

టైమ్స్ ఆఫ్ వార్త - చింతకాని



మండల పరిధిలోని నాగులవంచ గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులు గ్రామ కార్యదర్శి చిరంజీవి ఆధ్వర్యంలో జరుగుచున్నాయి. పిచ్చి చెట్లను తొలగించడంతోపాటు, అనారోగ్యంతో చనిపోయిన జంతువుల కళేబరాలను తొలగించారు .కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## చింతకాని సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల అమ్మకం



టైమ్స్ ఆఫ్ వార్త- చింతకాని

చింతకాని సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ రైతులకు జిలుగు, జనుము,వరి విత్తనాలు అమ్మకం ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చింతకాని తహసీల్దార్ కూరపాటి అనంతరాజులు మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతి వున్న దుకాణాల నుండి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులు నష్టపోవద్దు అని కోరారు. సంఘ అధ్యక్షులు కొండపల్లి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ విత్తనాల గురించి రైతులు ఆందోళన చెందవలసిన అవసరంలేదని, రైతులకు కావలసిన మేరకు విత్తనాలు అందించుటకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం రైతులు రబీలో పండించిన వరి ధాన్యం కొనుగోలు చేసిన తరువాత రైతులకు రావాల్సిన డబ్బులు మూడు రోజుల్లో వారి ఖాతాలో జమచేసినందుకు రైతులు రాష్ట్రప్రభుత్వానికి అభినందనలు తెలియజేసున్నట్టు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏవో మానస, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు కొప్పుల గోవింద రావు, సంఘ ఉపాధ్యకులు ఎం.రవి, డైరెక్టర్స్ కె.మనోహర్ బాబు, టి.కోటేశ్వరరావు,కార్యదర్శి శ్రీనివాస్ రావు, పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

టైమ్స్ ఆఫ్ వార్త - సదాశివనగర్



నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సదాశివనగర్ సిఐ సంతోష్ కుమార్, ఎస్సై రంజిత్, ఏవో ప్రజాపతి ఫర్టిలైజర్ దుకాణాల యజమానులకు హెచ్చరించారు. శనివారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. విత్తన బస్తాలను, ఎరువులను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. నిబంధనలు పాటించి ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. ఎట్టి పరిస్థితులలో రైతులకు లూజ్ సీడ్స్ విక్రయించరాదని, డీలర్లు కొనుగోలు చేసిన ఎరువుల, విత్తనాల వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై నమోదు చేయాలన్నారు. విత్తనాలకు సంబంధించిన లైసెన్సుడ్ కాపీలను రైతులకు కనబడే విధంగా డిస్ప్లేలో ప్రదర్శించాలన్నారు. నాసిరకం విత్తనాలు విక్రయించిన, ఎక్కువ ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దుచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ జెడ్పిటిసి



టైమ్స్ ఆఫ్ వార్త - సదాశివనగర్

సదాశివనగర్ మండల పద్మాజివాడ గ్రామానికి చెందిన బిఆర్ ఎస్ నాయకుడు సాయిబాబా భార్య అనారోగ్యానికి గురి అయిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు పరమశించారు. వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని ఎలాంటి ఆందోళన చెందవద్దని ధైర్యంగా ఉండాలన్నారు. వైద్యానికి అయినా ఖర్చులను ప్రభుత్వం ద్వారా ఇప్పించడానికి కృషి చేస్తామన్నారు. ఆయన వెంట నర్సాపురం లింగం, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## సోదర భావంతో పండుగలు జరుపుకోవాలి



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పి విటల్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాన్సువాడ పట్టణంలో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ,అన్ని పండుగలను శాంతియుతంగా సామరస్యంగా జరుపుకుంటారని అన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ పండుగను సోదర భావంతో జరుపుకోవాలని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు ,మైనార్టీ ,హిందూ, సోదరులు, పోలీస్ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి

గాంధారి మండల కేంద్రం లో శనివారం ముదిరాజ్ సంఘం -1 నూతన కార్యవర్గం ను ఏర్పాటు చేశారు. ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తూర్పు రాజులు, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రెడ్డి రాజులు ఆద్వర్యంలో పట్టణ అధ్యక్షుడిగా కామెల్లి కృష్ణ, ఉపాధ్యక్షుడుగా రెడ్డి శివయ్య, ప్రధాన కార్యదర్శిగా తూర్పు రాజశేఖర్, కోశాధికారిగా తూర్పు సంతోష్ ఎన్నికున్నారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న సంఘ సభ్యులు తూర్పు వెంకట్ రాజ్, సాయిరెడ్డి, శ్రీనివాస్,లక్ష్మణ్,సాయిలు, లైన్ రమేష్, నీల రవి, గైరబోయిన రమేష్, గంగయ్య బాలయ్య తదితరులు పాల్గొన్నారు



## నారపోగు బాలస్వామి వర్ధంతి

టైమ్స్ ఆఫ్ వార్త - చింతకాని



భారత కమ్యూనిస్టు పార్టీ కొదుమూరు మాజీ సర్పంచ్ నారపోగు బాలస్వామి మూడో వర్ధంతి సందర్భంగా స్థూపం దగ్గర సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి జెండా ఎగురువేసినారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవింద రావు స్థూపానికి పూలమాలవేసి నివాళులర్పించినారు జమ్మల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ కొదమూరులో నాలుగు సార్లు సర్పంచ్ గా, రెండుసార్లు ఎంపీటీసీగా ఒకసారి ఎంపీపీగా భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి గెలిచాడు అని అంటే అది నారపోగు బాలస్వామి కృషి అని భారత కమ్యూనిస్టు పార్టీ కోడుమూరు గ్రామంలో బలంగా ఉండడానికి పునాదులు వేసిన బాలస్వామి ని పార్టీ ఎప్పటికీ మరవదని ప్రతి సంవత్సరం కూడా వారి వర్ధంతి కార్యక్రమం నిర్వహించాలని తెలియజేశారు.

## అహల్య బయి హూల్కర్‌కి ఘన నివాళులు అర్పించిన బీజేపీ పార్టీ శ్రేణు

పాల్గొన్న బీజేపి పార్టీ మండల అధ్యక్షురాలుతాళ్లూరి మౌనిక



టైమ్స్ ఆఫ్ వార్త - బోనకల్

హిందూ మత కార్యకలాపాలు,ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ రాజమాతగా పేరు ప్రఖ్యాతలు గావించిన మాల్వా రాజపురానీ అహల్య బయి హూల్కర్ జయంతి సందర్భంగా వారికి భారతీయ జనతా పార్టీ బోనకల్ మండల అధ్యక్షురాలు తాళ్లూరి మౌనిక సురేష్ ఘన నివాళులు అర్పించారు,ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మందపల్లి మోహన్ రావు,ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరు సురేష్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి జంపాల రవి,యువ మోర్చా మండల అధ్యక్షులు కాలసాని పరశురాం,ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు మరిదు పరశురాముడు,మండల్ నాయకులు మరిది రామారావు,సైదేశ్వర రావు,ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## బిక్కనూర్ గ్రామ అంబేద్కర్ యువజన అధ్యక్షుడిగా దుబాసి భాను ప్రకాష్

టైమ్స్ ఆఫ్ వార్త బిక్కనూర్:



అంబేద్కర్ యువజన సంఘం బిక్కనూర్ గ్రామ అధ్యక్షుడిగా దుబాసి భాను ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా గ్రామ కమిటీతో కలిసి తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తల్ల గంగారం ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బిక్కనూర్ అంబేద్కర్ గ్రామ యువజన అధ్యక్షుని, గ్రామ కమిటీని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా గంగారం మాట్లాడుతూ.. గ్రామాన్ని గ్రామంలో ఉన్న యువతకు పూలే అంబేద్కర్ భావజాలంతో ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, సమన్వయంతో సమరసంతో కలిసి నరికి సంఘానికి ముందుకు నడిపించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల బాబు, జిల్లా ఉపాధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబాసి నరేందర్, భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీయం విటల్, మండల అధ్యక్షులు దుబాసి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పంప్ హౌస్‌లో ఎలక్ట్రిసిటీ అధికారుల పర్యటన..

టైమ్స్ ఆఫ్ వార్త - సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మల్లన్న గుట్ట వద్ద ఉన్న మిషన్ భగీరథ పంప్ హౌస్ పనులలో భాగంగా కామారెడ్డి ఎలక్ట్రిసిటీ ఎస్సీ శ్రావణ్ కుమార్, డి.ఈ కళ్యాణ్ చక్రవర్తి, ఏ.డి.ఈ నరేష్, ఏ.ఏ.ఈ గంగాధర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సప్లై పోజిషన్ అధికారులను ఆరా తీశారు. 11 కేవీ గాయత్రి ఫీడర్, 11 కెవి మార్కల్ ఏ జి ఎల్ ద్వారా అల్టెర్నెట్ సప్లై ఇవ్వడానికి అధికారులను ఆరా తిశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ సిబ్బంది ఏ.ఏ ల్.ఎం మోభ్య నాయక్, ఏ.ఎల్. ఎం సందీప్, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
ఆదివారం,
01-06-2025


# ఆంజనేయ స్వామి, గణపతి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం..

## పాల్గొన్న ఆలయ నిర్మాణ దాత వడ్డేపల్లి రాజేశ్వర్ రావు

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి



కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్, చిత్తారమ్మ బస్తీ డబుల్ బెడ్ రూమ్ సైట్ లో ఆంజనేయ స్వామి, గణపతి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు. గత మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా, పంచమి శుభముహూర్తంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆలయ నిర్మాణ దాత వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు, కమిటీ సభ్యులు రాజేశ్వరరావు కి ఘనంగా పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఆలయ అర్చకుల వేద ఆశీర్వచనములతో ఆశీర్వదించి సన్మానం చేశారు.అనంతరం ప్రత్యేక పూజలు, హెూమాలు, ఆలయ ధ్వజారోహణం, శాంతి హెూమం తదితర ఆధ్యాత్మిక కార్యక్ర మాల నిర్వహణ గురించి రాజేశ్వరరావు కమిటీ సభ్యులను అడిగి తెలుసుకుని స్వామివారి కృపకు పాత్రులైనరు.ఈ పవిత్ర కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు రమేష్, డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ కుమార్,రాజేందర్ ప్రసాద్, డివిజన్ నాయకులు వాణి నాయుడు, చంద్రప్రకాష్ రెడ్డి, నరేందర్ గౌడ్, ప్రదీప్ రెడ్డి,కన్నన్, పద్మారావు , రూప మహి ళా భక్తులు పెద్ద ఎత్తున హాజరై, స్వామివారి ఆశీస్సులు పొందారు..

# తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు

## తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ వేడుకలకు తరలి వెళ్లిన కూకట్ పల్లి జర్నలిస్టులు...

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి




తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని నగరంలోని జలవిహార్ లో నిర్వహించిన కార్యక్రమానికి కూకట్ పల్లి జోన్ నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి కోహీర్ నాగరాజ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్కే దయాసాగర్ ల ఆధ్వర్యంలో కూకట్ పల్లి చిత్తరమ్మ ఆలయం నుంచి బస్సులో జలవిహార్ కుచేరుకున్నారు. "తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు "నినాదంతో గత 25 సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం స్వరాష్ట్ర సాధన ఆకాంక్షను నెరవేర్చడానికి సబ్బండ వర్గాలను, సకల జనులను, రాజకీయ పార్టీలను ప్రజా సంఘాలను ఏకతాటి పైకి తీసుకొచ్చిన ఘనత తెలంగాణ జర్నలిస్ట్ ఫోరంకే దక్కుతుందని కష్ట ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్ , ఆర్కే దయాసాగర్ పేర్కొన్నారు. అక్షరాలను ఆయుదంగా మలిచి నాటి నుంచి తెలంగాణ కోసం పరితపించిన తెలంగాణ కలం యోధుడు అల్లం నారాయణ నేతృత్వంలో పురుడు పోసుకున్న తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం తెలంగాణ మనుగడ సాగించినంత కాలం తెలంగాణ మలిదశ ఉద్యమానికి తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం చేసిన తెలంగాణ అక్షర కలం కవాతు,అక్షర పోరు సువర్ణ అక్షరాలతో లిఖించబడి ఉంటుందని అన్నారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులపై ఒత్తిడి పెంచి పరిష్కరించేందుకు తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నాటి ఉద్యమ తరహాలో పోరాడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సదా మహేష్, భాస్కర్ చారి, కైలాష్, తెల్ల హరికృష్ణ, మహేందర్ నాయక్, రహిమాన్, హరికుమార్, బలరాం, రాజు యాదవ్, షబ్బీర్, నరేష్ సిటీ టైమ్స్, నాగమణి, ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రావణ్, నాగరాజు, ఆర్కే పటేల్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా పారిశుధ్యం

## పేరుకుపోతున్న చెత్తాచెదారం పట్టించుకోని గ్రామపంచాయతీ కార్యదర్శి



టైమ్స్ ఆఫ్ వార్త - బిక్కనూర్

బిక్కనూర్ మండల కేంద్రంలో పరిశుద్ధం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కుమ్మరి గల్లి, తో పాటు జెండా గల్లి, విజ్ఞాన్ హై స్కూల్ పక్కన ప్రాంతాల్లో పరిశుద్ధ పరిస్థితి మరింత దిగజారింది. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారయింది. చెత్తాచెదారంతో నిండిపోయిన దృశ్యాలు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా నిలుస్తున్నాయి. గ్రామీణ పారిశుద్ధంపై అత్యవసర చర్యలు గ్రామపంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



# సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి



124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రహిల్స్ కాలనీలో ఇరవై ఎనిమిది లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఎఈ శ్రావణి తో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షులు వెంకట్ నాయక్, జి.రామారావు, మోహన్ రావు, రంజిత్, మోహన్, ఎన్.బాల స్వామి, పి.వెంకటయ్య, శ్యామ్, యాదయ్య, లక్ష్మి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు...

# శ్రీరామ్ నగర్ కాలనీలోని కల్వర్ట్ ను పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణా రావు

## వర్షకాల దృష్ట్యా వర్షపు నీటితో సమస్య తలెత్తకుండా వెంటనే పరిష్కరించాలి

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి




కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఖైత్లాపూర్ శ్రీరామ్ నగర్ కాలనీలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు డిఈ శంకర్ తో కలిసి పర్యటించారు. శ్రీరామ్ నగర్ కాలనీ లోని కల్వర్ట్ ను పరిశీలించారు. వర్షకాల దృష్ట్యా వర్షపు నీటితో సమస్య తలెత్తకుండా వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు శ్రీ సిహెచ్ ప్రభాకర్ గౌడ్, ఖైత్లాపూర్ నాయకులు సంతోష్ కుమార్, యాదయ్య గౌడ్, నవీన్, రాజేష్ రాయ్, సాయి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు..

# లింగంపల్లి కాంగ్రెస్ నూతన అధ్యక్షులుగా ఎడ్ల గంగారాం

టైమ్స్ ఆఫ్ వార్త - సదాశివనగర్



సదాశివనగర్ మండల లింగంపల్లి గ్రామ కాంగ్రెస్ నూతన అధ్యక్షులుగా ఎడ్ల గంగారాం, ఉపాధ్యక్షులుగా గుండెల్లి సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని మండల అధ్యక్షులు సంగారెడ్డి తెలిపారు. గ్రామానికి ఇప్పటివరకు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవి వహించి గ్రామానికి సేవలందించిన లింగరావు, మధులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికయినా అధ్యక్షులు ఎడ్ల గంగారం మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# బాన్సువాడ డి.ఎస్.పి విట్టల్ రెడ్డినీ సన్మానించిన బిజెపి నాయకులు..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ



బాన్సువాడ డీఎస్పీ విట్టల్ రెడ్డి సార్ కి శనివారం బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ సీఐ అశోక్ ,బిజెపి జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, సాయిలు, బిజెపి పట్టణ అధ్యక్షులు కోణాల గంగారెడ్డి, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఉమేష్, పాశం భాస్కర్ రెడ్డి, తోపాటు తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# మున్నూరు కాపు విద్యార్థి విద్యార్థులకు ప్రతిభా పురస్కాలు ప్రధానం...




టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ డివిజన్ పరిధిలో మండలాల మున్నూరు కాపు విద్యార్థులు 2024 - 25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఇంటర్మీడియట లలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం మున్నూరు కాపు సంఘంలో కాసుల రోహిత్ అధ్యక్షతన 100 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల రాజు మాట్లాడుతూ ఇంత మంది విద్యార్థులు మంచి మార్కులు సాధించడం గర్వకారణం అని, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉన్నత చదువుల కొరకు నా వంతు కృషి చేస్తా నని, కాలేజీలలో ఫీజు రాయితీ కొరకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన విద్యార్థులకు అన్ని విధాల సాయం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి పెట్టి గాడి అంజయ్య, కోశాధికారి ఆంజనేయులు, బాన్సువాడ డివిజన్ అధ్యక్షులు సత్యనారాయణ , డాక్టర్ తోట కిరణ్ ,ప్రదీప్ పటేల్ , మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టంల గంగాధర్ ,బిట్ల సురేందర్ ,గుడాల నగేష్ ,మంద ప్రవీణ్,వివిధ మండలాల అధ్యక్షా, కార్యదర్శులు ,విద్యార్థుల తల్లితండ్రులు, తదితరులు, పాల్గొన్నారు.

# కలెక్టర్, సబ్ కలెక్టర్కు బాన్సువాడ మలీ దశ ఉద్యమకారుల పోరం ప్రతినిధుల వినతి



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:


కామారెడ్డి జిల్లా కార్యాలయములో కలెక్టర్, బాన్స్ వాడ సబ్ కలెక్టర్, తహసీల్దార్ నీ శనివారం కలసి రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల యొక్క త్యాగ ఫలితమే జూన్ రెండు వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినముగా గుర్తించి, ఆవిర్భావ ఉత్సవములలో భాగంగా ఉద్యమకారులకు ఆహ్వా నించవలసినదిగా కోరడమైనది. ఇట్టి కార్యక్రమం లో ఉద్యమకారుల ఫోరం కామారెడ్డి జిల్లా కన్వీనర్ ఉడుత గంగాధర్ గుప్త, బాన్స్ వాడ మండల ప్రధాన కార్యదర్శి గంజివార్ చందు, భీమా నాయక్, రాంచందర్,ఎర్రవటి సాయిబాబా, కృష్ణ, భాస్కర్ గౌడ్, రాజు,పవన్ పాల్గొనటం జరిగినది.

TIMES OF VARTHA (01-06-2025)MADKM_times of varha main (13-2).qxd 6/1/2025 4:04 AM Page 8

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



## భారత్ పాక్ యుద్ధాన్ని ఆపింది నేనే:ట్రంప్



పాక్ పోరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారిఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్‌లు పరస్పరం యుద్ధం కొనసాగించకుండా నియంత్రించానని, అణు విపత్తుకు దారి తీసే పోరును ఆపగలిగినందుకు గర్వంగా ఉందని అన్నారు. పరస్పరం కాల్పులు జరుపుకునే దేశాలతో తాము వాణిజ్యం కొనసాగించలేమని గతంలో ఇరు దేశాలకు స్పష్టం చేశానని ట్రంప్ తెలిపారు. యుద్ధాన్ని ఆపకపోయినట్లయితే అమెరికా రెండు దేశాలతో వాణిజ్యాన్ని బంద్ చేస్తుందని తాను భారత్, పాకిస్థాన్‌లకు స్పష్టం చేసినట్లు గత కొద్ది వారాలుగా ట్రంప్ పదే పదే చెప్తూ వస్తున్న విషయం తెలిసిందే. అయితే పాక్‌తో సైనిక ఘర్షణ సమయంలో భారత్, అమెరికా నేతల మధ్య జరిగిన చర్చల్లో వాణిజ్యం అంశం ప్రస్తావనకే రాలేదని భారత్ గత గురువారం నాడు స్పష్టం చేయడం ద్వారా ట్రంప్ చేస్తున్న వాదనలను నిర్ద్వందంగా తోసిపుచ్చిన విషయం తెలిసిందే. అయినా ట్రంప్ మాత్రం పాతపాటే ఇంకా పాడుతున్నారు. భారత్ పాకిస్థాన్‌ల మధ్య పోరు అణు యుద్ధంగా మారే ప్రమాదం ఉందని భావించానని శుక్రవారం ఓవల్ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ట్రంప్ అన్నారు.' తూటాల ద్వారా కాకుండా వాణిజ్యం ద్వారా అణు యుద్ధ ప్రబాదాన్ని ఆపగలిగినందుకు గర్వంగా ఉందని ఆయన అన్నారు. సాధారణంగా అవి తూటాల ద్వారా ఆ పని చేస్తాయి. అయితే మనం వాణిజ్యం ద్వారా యుద్ధాన్ని అపగలిగాం. ఇరు దేశాలు యుద్ధాన్ని ముగించినందుకు ఆ దేశాల అధినేతలకు , ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఇరు దేశాలతో తాము సాగిస్తున్న వాణిజ్య వ్యవహారాలపై మాట్లాడుకున్నామని, పరస్పరం కాల్పులు జరుపుకొంటూ, అణ్వాయుధాలు ఉపయోగించే సత్తా కలిగిన దేశాలతో తాము వాణిజ్యం జరపలేమని స్పష్టం చేశామని అమెరికా అధ్యక్షుడు అన్నారు. భారత్, పాక్‌లకు చెందిన నేతలు తమను అర్థం చేసుకున్నారని, తమ వినతిని అంగీకరించి యుద్ధాన్ని ముగించారని ఆయన అన్నారు. అంతేకాదు, అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపేందుకు పాకిస్థాన్ ప్రతినిధులు వచ్చేవారం వాషింగ్టన్‌కు రానున్నట్లు కూడా ట్రంప్ చెప్పారు.

# పారదర్శకంగా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు..

**అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**జూన్ 3 నుంచి జూన్ 20 వరకు మండలాల్లో**

**రెవెన్యూ సదస్సుల నిర్వహణ**

**రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమీక్ష**

**నిర్వహించిన జిల్లా కలెక్టర్**

టైమ్స్ ఆఫ్ వార్త - ఖమ్మం





భూ భారతి చట్టం క్రింద ప్రజల నుంచి వచ్చే భూసమస్యల దరఖాస్తులను పారదర్శకంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ పై తహశీల్దార్లు, నాయబ్ తహశీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ నేలకొండపల్లి, బోనకల్ మండలాలను పైలట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసుకొని గ్రామాలలో భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించామని, భూ భారతి చట్టం ప్రకారం వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూన్ 3 నుంచి జూన్ 20 వరకు జిల్లాలోని మిగిలిన మండలాల వారిగా కూడా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి మండలానికి తహసిల్దార్ అధ్యక్షతన ఒక బృందం, నాయబ్ తహసిల్దార్ అధ్యక్షతన మరో బృందం ఏర్పాటు చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతి మండలానికి రెండు బృందాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతిరోజు రెవెన్యూ సదస్సుల నిర్వహణ సంబంధించి రిపోర్ట్ సమర్పించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి భూ సమస్య దరఖాస్తుకు సంబంధించి రసీదు అందించాలని అన్నారు. ప్రతి గ్రామంలో పూర్తి స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని అవసరమైన మేర హెల్ప్ డెస్క్, దరఖాస్తులు స్వీకరించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్.ఎస్ .ఆర్, పి.ఓ.టి, భూ సేకరణ కేసులు, సరిహద్దు వివాదాలు, పార్ట్ బీ కేసులు, అసైన్మెంట్ భూములకు సంబంధించిన వివాదాలు సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. జూన్ 1 నాటికి ప్రతి మండలంలో అవసరమైన మేర దరఖాస్తులను ప్రింట్ తీసి పెట్టుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తును తిరస్కరించే పక్షంలో తప్పనిసరిగా కారణాలు స్పష్టంగా తెలియజేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారం సంబంధించి అధికారులు పూర్తి పారదర్శకంగా చట్టం ప్రకారం, నిబంధనల మేరకు పనిచేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, రెవెన్యూ డివిజన్ అధికారులు జి. నర్సింహారావు, ఎల్. రాజేందర్ గౌడ్, సర్వే ల్యాండ్ రికార్డ్ సహాయ సంచాలకులు శ్రీనివాసులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## కవిత పాత్రధారిగా చార్‌పత్తా సినిమా

**కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రిబండి సంజయ్‌కుమార్**



కరీంనగర్ : కల్వకుంట్ల కవిత పాత్రధారిగా చార్‌పత్తా సినిమా నడుస్తోందని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు ఏమి మేలు జరుగుతుందని ప్రశ్నించారు. చిట్‌చాట్‌ల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లోకి వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఆ పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమై త్వరలో పొత్తు పెట్టుకుంటామని చెప్పి వారిని అడ్డుకున్నారన్నారు. బీఆర్ఎస్ అంటేనే అవినీతి పార్టీ అని, కవితను అరెస్టు చేయకుండా ఉండడానికి బీజేపీతో కలవడానికి బీఆర్ఎస్ ప్రయత్నించిందన్నారు. కుటుంబ పార్టీని తాము దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. పంటలకు మద్దతు ధర పెంచుతూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ప్రధాని మోదీకి తెలంగాణ రైతుల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌజ్, ఫార్ములా ఈ కార్ రేసు కేసుల విషయంలో బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పిందన్నారు. వేములవాడ రాజన్న ఆలయం పరిధిలో 18 ఆవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు దేశద్రోహమే అన్నారు. భారత సైన్యం ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేలా, పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషించే రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. రాఫెల్ యుద్ధ విమానాలను వినియోగించిందని, భారతసైన్యం వాటిని విమర్శించడమంటే సైన్యంపై కాంగ్రెస్‌కు నమ్మకం లేనట్లుగా భావించాల్సి ఉంటుందన్నారు. ఆర్మీ ఛీఫ్‌పై విశ్వాసం లేదా అని ప్రశ్నించారు. ఎమైనా అంటే ఇంధిరగాంధీని ప్రస్తావిస్తారని, ఆమె హయాంలో యుద్ధం జరిగితే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను ఎందుకు స్వాధీనం చేసుకోలేక పోయారని ప్రశ్నించారు. ఈటల రాజేందర్, హరీష్‌రావు భేటీ విషయం తనకు తెలియదన్నారు. కాంగ్రెస్, బబీఆర్ఎస్ కలిసి బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయని, వాళ్లెన్ని కుట్రలు చేసినా బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోలేరన్నారు.

## అస్సాంలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి



అస్సాంలో గత 24 గంటల్లో కురిసిన భారీ వర్షానికి ఆరు జిల్లాల్లో వరదలు చోటుచేసుకున్నాయి. 10వేలకు పైగా జనులు ప్రభావితం అయ్యారు. కాగా కొండచరియలు విరిగిపడి ఐదుగురు మరణించారు. అయితే ఆ ఐదుగురు కామ్‌రూప్‌కు చెందిన వారేనని అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ(ఎఎస్‌డిఎంఎ) తెలిపింది. రాష్ట్రంలోని పశ్చిమ భాగంలో ఉన్న మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. మిగతా ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. పైనున్న అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయలో కురిసిన వర్షం నీరు కూడా ప్రవహించడంతో అస్సాంలో వరద తీవ్రత మరింత పెరిగింది. నీళ్లలో మునిగిన ప్రదేశాల్లో అనేక సంస్థలు బాధితులకు సాయం అందిస్తున్నాయని పట్టణ వ్యవహారాల మంత్రి జయంత మల్ల బారువా తెలిపారు. అస్సాంలోని కామ్‌రూప్, కచర్, ధేమాజీ, లఖింపుర్, గోలాఘట్ లను వరదలు ముంచెత్తుతున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన నదుల నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. లఖింపుర్‌లోని దిబ్రుగఢ్, రంగనది, జియా భరలీ, కోపిలి బేకిలలో బ్రహ్మపుత్ర నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తోంది. రాష్ట్రం అసాధారణ పరిస్థితిని ఎదుర్కొంటోందని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. గౌహతి విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు.

## నైజీరియాలో వరదలకు 151 మంది మృతి



నైజీరియాలోని ఉత్తర మధ్య పట్టణం మోక్వాలో భయానక వరదలలో ఇప్పటివరకూ 151 మంది వరకూ మృతి చెందారు. శనివారం ఈ విషయాన్ని దేశ అత్యయిక సేవల విభాగం అధికారికంగా తెలిపింది. ఈ పట్టణం ఎక్కువగా మార్కెట్‌లతో ఉండే ప్రాంతం కావడంతో సంబంధిత వ్యాపారులు ఎక్కువగా నష్టపోయారు. ఇక్కడి నుంచే పలు ప్రాంతాలకు సరుకులు రవాణా అవుతాయి. ఆకస్మిక వరదలతో పరిస్థితి భయానకంగా మారింది. పలువురి మృతదేహాలు, దుకాణాలలోని కూరగాయలు ఇతర వస్తువులు చాలా దూరం వరకూ కొట్టుకువెళ్లాయి. ఈ ప్రాంతంలో దాదాపు 3వేల మంది వరకూ నిర్వాసితులు అయ్యారని అధికారులు తెలిపారు. దాదాపుగా ఐదు గంటల పాటు ఉధృతి రీతిలో వరదలు ఆకస్మికంగా హెూరెత్తాయి. దీనితో స్థానికులు ఎటువంటి రక్షణ చర్యలకు దిగలేకపోయినట్లు తెలిసింది. ఇక్కడి దుర్ఘటనపై నైజిరియా అధ్యక్షులు బోలా టింబూ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో సహాయ చర్యలు ముమ్మరం చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు.


## రోహిత్ శర్మ అరుదైన రికార్డు




హైదరాబాద్: ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్, 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ ఐపీఎల్ 2025 సీజన్‌లో ఒకే మ్యాచ్‌లో రెండు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. ఈ మెగా టోర్నీలో 7000 పరుగుల మైలురాయిని అందుకున్న రెండో ఆటగాడిగా, అలాగే 300 సిక్సర్లు బాదిన రెండో క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. గుజరాత్ టైటాన్స్‌తో ముల్లాన్‌పూర్‌లో గత రాత్రి జరిగిన ఉత్కంఠభరిత ఎలిమినేటర్ మ్యాచ్‌లో రోహిత్ ఈ ఘనతలు సాధించాడు. ఈ మ్యాచ్‌కు ముందు కేవలం 15 సగటుతో ఉన్న రోహిత్ శర్మ.. కీలకమైన నాకౌట్ పోరులో విశ్వరూపం ప్రదర్శించాడు. గుజరాత్ బౌలర్లపై ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగిన రోహిత్ 50 బంతుల్లోనే 81 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఇందులో నాలుగు భారీ సిక్సర్లు, ఏడు ఫోర్లు ఉన్నాయి. రోహిత్ అద్భుత బ్యాటింగ్‌తో ముంబై ఇండియన్స్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.

## ఢిల్లీలో కొవిడ్‌తో తొలి మరణం

ఢిల్లీలో 60 ఏళ్ల వృద్ధురాలు కొవిడ్ సోకడంతో మృతి చెందినట్లు అధికారులు శనివారం తెలిపారు. ఈమె గత కొన్ని రోజులుగా ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, కొవిడ్ సోకడం యాదృచ్ఛికమని అధికారులు తెలిపారు. లాపరోటమీ ఆపరేషన్ అనంతరం పేగులో అడ్డంకి కారణంగా బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు కొవిడ్ సోకినట్లు అధికారులు తెలిపారు. కాగా దేశ రాజధానిలో కొవిడ్ మరణం ఇదే మొదటిది. అయితే ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆస్పత్రుల్లో బెడ్స్, వెంటిలేటర్లు, ఆక్సిజన్, యాంటీ బయోటిక్స్, ఇతర మందులు అన్నీ సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.



# కరోనా కేసులు 3,300కు పైనే..



న్యూఢిల్లీ: భారత్ లో కొవిడ్ యాక్టివ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా ఈ సంఖ్య సుమారు 3,000కు చేరుకుంది. కేరళలో అత్యధికంగా కేసులు నమోదు కాగా, మహారాష్ట్ర, ఢిల్లీ ఆ తరువాత స్థానంలో ఉన్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం కొవిడ్ యాక్టివ్ కేసులు గత నలుగు రోజుల్లో వేగంగా పెరిగాయి. మే 26న భారత్‌లో 1,010 కేసులు నమోదు కాగా, మే 30వ తేదీకి 2,710కి చేరినట్టు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారిక డాటా వెల్లడించింది. మంత్రిత్వ శాఖ అధికార గణాంకాల ప్రకారం, కేరళలో 1,147 కేసులు, మహారాష్ట్రలో 424, ఢిల్లీలో 294, గుజరాత్‌లో 223 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి.

తమిళనాడులో ఇంతవరకూ 148 కేసులు నమోదు కాగా, కర్ణాటకలో 148, పశ్చిమబెంగాల్‌లో 116 కేసులు నమోదయ్యాయి. రాజస్థాన్‌లో 51, ఉత్తరప్రదేశ్‌లో 42, హర్యానాలో 20, ఆంధ్రప్రదేశ్‌లో 16, మధ్యప్రదేశ్‌లో 10, గోవాలో 7, ఒడిసా, పంజాబ్, జమ్మూకశ్మీర్‌లో నాలుగేసి చొప్పున నమోదయ్యాయి. తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్‌లో మూడేసి చొప్పున కేసులు నమోదయ్యాయి. మిజోరం, అసోంలో రెండేసి కేసులు నమోదయ్యాయి. అండమాన్ నికోబార్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్ నుంచి ఎలాంటి యాక్టివ్ కేసులు నమోదు కాలేదు. బీహార్‌కు సంబంధించి అధికారిక డేటా అందుబాటులో లేదు.

**PRINTED, PUBLISHED & OWNED BY** MANKALA DASU, H.NO, 3-8-289, Road No. 2 SURYODAYA COLONY , LB NAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor MANKALA DASU, RNI NO. **APTEL/2007/22828** CELL: 9705506999